
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 15 జూలై 2025



డొంకరోడ్డు ఆక్రమణ!

- రోడ్డు మట్టిని తవ్వి టిప్పర్లలో తరలించి సొమ్ము చేసుకున్నారు..
- కుచించుకుపోయిన డొంకరోడ్డుతో రైతుల ఇక్కట్లు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

పోలిమెట్ల-కొమరవోలు డొంకరోడ్డు సరిహద్దు రైతుల దుశ్చర్య

ఆక్రమణకు కాదేదీ అనర్హం అన్నట్టుగా ఉంది కొందరు స్వార్థపరుల వ్యవహారశైలి. గుడ్లవల్లేరు-పామర్రు మండలాల సరిహద్దున ఉన్న పోలిమెట్ల-కొమరవోలు గ్రామాల రైతులు ఉపయోగించుకునే డొంక రోడ్డును ఆక్రమించేశారు. రెండు ఎకరాల వరకు తమ పొలాల్లో కలిపేసుకున్నారు. మరికొందరు ఇంకో అడుగు ముందుకేసి డొంక రోడ్డులోని మట్టిని తవ్వి టిప్పర్లలో తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇదేంటని ప్రశ్నించిన రైతులను బెదిరిస్తున్నారు. దీంతో కుచించుకుపోయిన రోడ్డుతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

రెండు ఎకరాల వరకు పొలాల్లో కలిపేశారు..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గుడ్లవల్లేరు, కొమరవోలు గ్రామాల సరిహద్దున గాంధీ ఆశ్రమం సమీపంలో పొలాల మధ్య డొంకరోడ్డు ఎప్పటి నుంచో ఉంది. వరి కోతలు పూర్తి చేసిన అనంతరం ధాన్యం సకాలంలో ఇంటికి చేర్చేందుకు, పంట సాగులో ఉన్నపుడు ఎరువులు పొలం వరకు తీసుకువెళ్లేందుకు, రైతులు పొలాల వద్దకు చేరుకునేందుకు, ఇతర భవిష్యత్తు అవసరాలకోసం గతంలో డొంక రోడ్లను ప్రభుత్వం విడగొట్టింది. వరి కోతలు పూర్తి చేసిన తర్వాత ఈ డొంక రోడ్డుపై ఉన్న స్థలంలో కుప్పలు వేసి అక్కడే నూర్పిడి పనులు రైతులు చేసుకునేవారు. కాలక్రమంలో ఈ డొంక రోడ్డు వెంబడి ఉన్న రైతులు డొంక రోడ్డును ఆక్రమించి, మట్టిని తవ్వేసి విక్రయించేశారు. కొందరు పొలంలోని పల్లపు ప్రాంతాలను పూడ్చేందుకు ఈ మట్టిని వినియోగించారు. కిలో మీటరు దూరానికిపైగా ఉన్న ఈ డొంకరోడ్డును రైతులు పోటీపడి మరీ తవ్వేయడం మిగతా 6లో..

టిప్పర్లలో మట్టిని తరలించేశారు

పోలిమెట్ల, కొమరవోలు గ్రామాల సరిహద్దున ఉన్న ఈ డొంక రోడ్డును కొందరు పెద్దలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని గత వేసవిలో మట్టిని తవ్వి టిప్పర్లలో తరలించి సొమ్ము చేసుకున్నారు. అదేమని స్థానిక రైతులు ప్రశ్నిస్తే అందరితో పాటే మేము మట్టిని తవ్వుతున్నామని, గతంలో డొంక రోడ్డును వేరే రైతులు తవ్వేసినపుడు ఏం చేశారని ఎదురు ప్రశ్నిస్తూ బెదిరింపులకు దిగేవారని రైతులు వాపోయారు. ఇటీవల ట్రాక్టర్లు డొంక రోడ్డు వెంబడి శివారు ప్రాంతం వరకు వెళ్లి, మళ్లీ తిప్పుకుని వచ్చేందుకు డొంకరోడ్డును రెండు మీటర్ల మేర వెడల్పు చేస్తే దానిని తొలగించారని స్థానిక రైతులు ఆరోపించారు.



పోలిమెట్ల-కొమరవోలు గ్రామాల సరిహద్దున డొంకరోడ్డును తవ్వేయడంతో తగ్గిన వెడల్పు

గుడ్లవల్లేరులో అరెకరం భూమిని ఆక్రమించేశారు

గుడ్లవల్లేరులో పుల్లేరు కాలువ గట్టు వెంబడి ఉన్న నీటిపారుదలశాఖకు చెందిన భూమిని గత వేసవిలో స్థానిక రైతు ఒకరు తన పొలంలో కలిపేసుకున్నాడు. అరెకరం పైగా భూమిని ఆక్రమించిన విషయంపై స్థానిక రైతులు నీటిపారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి వచ్చేశారు. ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో నగరంలోని కొత్త ప్రభుత్వాసుపత్రి (జీజీహెచ్)లో జరిగిన కొనుగోళ్లలో భారీ ఎత్తున గోల్‌మాల్ జరిగిన విషయం బయటపడింది. ఈ వ్యవహారాల మాటున రూ.కోట్ల అవినీతి చోటు చేసుకుందని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. వైసీపీ హయాంలో నియమితుడై.. కూటమి ప్రభుత్వంలోనూ కొద్దికాలం పనిచేసిన వైద్యాధికారి కనుసన్నల్లో ఈ భారీ అవినీతి జరిగిందని తెలుస్తోంది. ప్రభుత్వాసుపత్రిలో జరిగిన ప్రతి కొనుగోలు వెనుక ఈ అవినీతి మూలాలు వెలుగులోకి వస్తున్నాయి.

కొటేషన్లలో కొట్టేశారు..!

వైసీపీ హయాంలో జీజీహెచ్‌లో అవినీతి

ఓ అధికారి అత్యుత్సాహంతో ప్రతి పనికీ రేటు

మందులు, ఆక్సిజన్, పరికరాలు, పనిముట్లు ఏది కొన్నా కమీషనే..

- అస్మదీయ సంస్థలు, వాటి డమ్మీలకు కొటేషన్లు ఇచ్చి కొనుగోళ్లు
- రిపేర్ల ముసుగులోనూ కొనసాగిన దందా
- సీసీ కెమెరాల కొనుగోళ్లలో ఇష్టానుసారంగా..
- ప్రభుత్వానికి అందుతున్న ఫిర్యాదులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ప్రభుత్వాసుపత్రికి అవసరమైన అన్ని రకాల మందులు, ఆక్సిజన్, ఇతర రసాయనాలు, మార్చురీ బాక్స్‌లు, ల్యాబ్, ఎలక్ట్రికల్ ఐటమ్స్, ఏసీలు, బెడ్లు, స్ట్రెచర్లతో పాటు సబ్‌స్టేషన్ రిపేర్లు, సివిల్ వర్క్స్.. ఇలా ప్రతి కొనుగోలు, మరమ్మతులను నిబంధనలకు విరుద్ధంగా అస్మదీయ సంస్థలకు కట్టబెట్టి రూ.కోట్ల ప్రభుత్వ సొమ్మును లూటీ చేసినట్టు తెలుస్తోంది. ఆసుపత్రిలో రూ.10 వేలకు మించి ఏది మిగతా 6లో..

భవానీ ద్వీపంలో భారీ స్థాయిలో ఆక్రమణలు జరిగాయి. ఎవరూ వెళ్లలేని ప్రాంతంలోకి అక్రమార్కులు చొరబడి సుమారు 15 ఎకరాల్లోని చెట్లను కొట్టేశారు. పది ఎకరాల విస్తీర్ణంలో భూమిని చదును చేసేశారు. చెట్ల కలపను ఓ చోట భారీగా నిల్వ చేశారు. ఈ క్రమంలో వినియోగంలో లేని భూముల సర్వేకు వెళ్లిన పర్యాటకాభివృద్ధి సంస్థ అధికారులు ఈ ఆక్రమణలను చూసి షాక్ తిన్నారు. ఇది కలప దొంగల పనా లేక కబ్జాకోరుల పనా అనేది తేల్చేపనిలో పడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలోనే ఈ వ్యవహారం జరిగి ఉండవచ్చునని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

భవానీ ద్వీపంలో.. ఆక్రమణలు!

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్న అధికారులు

దక్షిణం దిక్కున 15 ఎకరాల విస్తీర్ణంలో చెట్లు కొట్టివేత

- ఒకే చోట 10 ఎకరాల్లో చదును చేసిన నేల
- ఒక పక్కన భారీగా చెట్ల కలప నిల్వలు
- ఎవరూ వెళ్లలేని ప్రాంతంలో ఈ వ్యవహారం
- గత వైసీపీ హయాంలోనే జరిగిందని అనుమానం!
- కలప దొంగల పనా.. లేక కబ్జాకోరుల పనా!
- నిగ్గు తేలాల్సిన విషయాలు ఎన్నో..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): భవానీ ద్వీపంలో ఇప్పటి వరకు వినియోగంలో లేని ప్రాంతాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారుల నుంచి పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అధికారులకు ఆదేశాలు అందేయి. దీంతో వారు సర్వే చేపట్టారు. ఈ క్రమంలో భారీ ఆక్రమణలు వెలుగు చూశాయి. ఇందులో ప్రధానంగా భవానీ ద్వీపం దక్షిణ వైపు ప్రాంతంలో భారీ ఆక్రమణలను గుర్తించారు. దాదాపుగా 15 ఎకరాల విస్తీర్ణంలో చెట్లన్నీ కొట్టి వేసి నేల చదును చేసి ఉంది. చెట్ల దుంగలను అక్కడ లాట్లుగా పేర్చి ఉంచారు. కలప కోసం ఈ ఘాతుకానికి తెగించారా ? ద్వీపం భూములనే ఆక్రమించాలని నిర్ణయించారా? అన్నదానిపై సమగ్ర దర్యాప్తు జరిగితే కానీ తెలియదు. ఒక చతురస్రాకారంలో చెట్లను తొలగించి నేలను చదును చేసి ఉంచారు.

కృష్ణానదిలో అతిపెద్ద ద్వీపం

కృష్ణానదిలో అతిపెద్ద దీవులలో భవానీ ద్వీపం కూడా ఒకటి. భవానీ ద్వీపం మొత్తం 136 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో పర్యాటకులకు అందుబాటులో ఉన్నది కేవలం 25 ఎకరాల విస్తీర్ణం మాత్రమే. భవానీ ఐల్యాండ్ కొత్తగా నిర్మించిన కృష్ణా బ్రిడ్జి వరకు కూడా విస్తరించి ఉంది. ఏడు ముక్కలుగా నదిలో భవానీద్వీపం ఉంటుంది. కానీ, అన్నీ కలిసి ఉంటాయి. భవానీ ద్వీపానికి దక్షిణం వైపునకు వెళితే మరో ద్వీపం ఉన్నట్టుగా కనిపిస్తుంది. ఇక్కడి నుంచి చూసిన వారికి అది మరో మిగతా 6లో..



పెద్ద ఎత్తున కలప నిల్వలు

చెట్లు కొట్టి చదును చేసిన ప్రాంతంలో పెద్ద ఎత్తున కలపను నిల్వ ఉంచారు. కలప దొంగలు ఈ పని చేశారా ? మరెవరు చేశారన్నదానిపై స్పష్టత రావటం లేదు. ఇటీవల భవానీ ద్వీపంలో చెట్లు నరికి కలపను ఎత్తుకుపోతున్న వారిని ఏపీటీడీసీ సిబ్బంది పట్టుకున్నారు. ఈ కోణంలో చూస్తే ఇంటి దొంగల సహాయంతో కలప దొంగలే ఈ పని చేశారా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మొదళ్లతో సహా చెట్లను పెకిలించి నేలను చదును చేయటం చూస్తే ఆ భూమిని కూడా కబ్జా చేశారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఇంత దారుణం అనేది ఇప్పటికిప్పుడు జరిగింది కాదని.. రెండేళ్లుగా చేసిన పనిగా పర్యాటకాభివృద్ధి సంస్థ అధికారులు భావిస్తున్నారు. దీనిని బట్టి చూస్తే వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ దారుణం జరిగి ఉండవచ్చన్న అనుమానాలు నెలకొంటున్నాయి. భవానీ ద్వీపంలో మరిన్ని ఆక్రమణలు ఉన్నాయని ఏపీటీడీసీ అధికారులు గుర్తించారు. భవానీ ద్వీపాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటంతో ఆక్రమణలు నెలకొన్నాయని తెలుస్తోంది.

కిలేడీ సింగర్!

బెజవాడ పబ్‌లో విధులు

ఆమె తన మధురమైన గానంతో నగరంలోని ఓ పబ్‌లో పాడుతుంది. అక్కడకు వచ్చే వారిని తన అందచందాలతో ఆకట్టుకుంటుంది. డబ్బున్న వారితో పరిచయాలు పెంచుకుని.. భర్తతో విడిపోయానని.. ఒంటరిగా ఉంటున్నానని వలపు వల విసురుతుంది. అందులో చిక్కుకున్న వారితో ఏడడుగులు వేస్తుంది. ఆ తర్వాత వారిని దోచుకుని మరొకరితో వివాహానికి సిద్ధమవుతోంది. ఇలా ఒకరికి తెలియకుండా ఒకరు చొప్పున అరడజను మందిని పెళ్లిళ్లు చేసుకున్న ఈ కిలాడి సింగర్ పబ్‌లో జరిగిన ఓ గొడవ విషయమై పోలీసులను ఆశ్రయించి అడ్డంగా బుక్కైంది.

ధనవంతులతో పరిచయాలు

- ఒంటరిగా ఉంటున్నానని వలపు వల
- వారితో పెళ్లి.. భారీగా డబ్బు వసూలు
- ఒకే నెలలో ఇద్దరిని వివాహం చేసుకున్న మాయలేడి
- పబ్‌లో గొడవపై సీఐని ఆశ్రయించిన సింగర్, మరో వ్యక్తి
- పోలీస్ విచారణలో సింగర్ పెళ్లిళ్ల గుట్టురట్టు
- అరడజను మందిని పెళ్లిళ్లు చేసుకున్న సింగర్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఓ వ్యక్తి భార్య



ఓ యువకుడితో లేడీ సింగర్ పెళ్లి ఫొటో

వన్‌టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని కృష్ణలంకకు చెందిన ఓ మహిళ (40)కు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యభర్తల గొడవ నేపథ్యంలో ఇద్దరూ విడిపోయారు. ఆమె విజయవాడ బందరు రోడ్డులోని ఓ పబ్‌లో సింగర్‌గా పనిచేస్తుంది. ఆమె వ్యవహారశైలి నచ్చకపోవటంతో తల్లిదండ్రులు ఆమెను ఇంటిలో నుంచి పంపించి వేశారు. మొదట్లో యనమలకుదురులో ఇల్లు అద్దెకు తీసుకుని పిల్లలతో ఉండేది. ప్రస్తుతం పటమటలోని ఓ అపార్టుమెంట్‌లో ఉంటుంది. పబ్‌కు వచ్చే డబ్బున్న వారితో పరిచయం పెంచుకుని వారిని ట్రాప్ చేసేది. తాను భర్తతో విడాకులు తీసుకున్నానని చెప్పి ఒకరికి తెలియకుండా మరొకరిని వివాహాలు చేసుకున్నట్లు సమాచారం. ఆమె సుమారు అరడజను మందిని వివాహమాడినట్టు తెలిసింది. వీరిలో వివాహితులు, అవివాహితులు ఉన్నట్టు సమాచారం.

ఫిర్యాదు చేయడానికి వెళ్లి ఇరుక్కుపోయింది..

ఇంత వరకు ఆమె ఆటలు బాగానే సాగాయి. అయితే పబ్‌లో రెండు, మూడు గ్రూపులు ఉండటంతో ఆధిపత్య పోరు సాగుతోంది. తాజాగా ఒక గ్రూపునకు చెందిన వ్యక్తితో ఆమె గొడవ పడింది. ఈ వ్యవహారాన్ని సింగర్, ఆమె పెళ్లి చేసుకున్న కొత్తపేటకు చెందిన వ్యక్తి కలిసి ఇటీవల బందరు రోడ్డులోని ఎస్ఎస్ కళ్యాణ మండపం వద్ద విధుల్లో ఉన్న సీఐ దగ్గరకు వెళ్లి పబ్‌లో జరుగుతున్న గొడవ గురించి చెప్పారు. స్పందించిన సీఐ పబ్‌పై నిఘా పెట్టమని కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా సమయానికి మించి పబ్ తెరచి ఉంటుందని సమాచారం తెలుసుకున్న సీఐ తన సిబ్బందితో అక్కడకు వెళ్లారు. సింగర్ వ్యవహారశైలిపైన అనుమానం ఉండటంతో సింగర్‌ను, ఆమె పెళ్లిచేసుకున్న కొత్తపేటకు చెందిన వ్యక్తిని కూడా స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు. ఈ విచారణలో సింగర్ వ్యవహారం బయట పడింది. వారిద్దరిని పోలీసులు విచారణ నిమిత్తం రెండు మూడు రోజుల పాటు స్టేషన్‌కు పిలిపించటంతో అతను ఇంటికి వెళ్లలేదు. దీంతో అతని కుటుంబ సభ్యులు ఆరా తీయటంతో అతను సింగర్‌ను పెళ్లి చేసుకున్న విషయం బయటపడింది. అతని భార్య పోలీసు స్టేషన్‌కు వెళ్లి సీఐని పూర్తి వివరాలు అడిగి తెలుసుకుంది. సీఐ రహస్యంగా ఈ వ్యవహారాన్ని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

జూన్ 5న ఒకరితో, 27న మరొకరితో పెళ్లి..

పోలీసుల దర్యాప్తులో సింగర్ జూన్ 5వ తేదీన వన్‌టౌన్‌కు చెందిన వ్యక్తిని దుర్గగుడిలో, అదే నెల 27వ తేదీన పోరంకికి చెందిన వ్యక్తిని సింహాచలంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో వివాహం చేసుకున్నట్లు తెలిసింది. వీరు కాకుండా మరో వ్యక్తిని వివాహం చేసుకోవటానికి సింగర్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటి వరకు సింగర్ వివాహం చేసుకున్న వ్యక్తుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు గుంజుకున్నట్లు కూడా సమాచారం. సింగర్ వివాహం చేసుకున్న కొత్తపేటకు చెందిన వ్యక్తి తరచూ పబ్‌కి వెళుతూ ఓ మాజీ ఎమ్మెల్యే సోదరుడినంటూ ఆమెను పరిచయం చేసుకున్నాడు. ఆమె కూడా అతని మిగతా 6లో..



ఊపిరి పోసిన ఫేస్‌బుక్ సందేశం

- రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థికి తీవ్ర గాయాలు
- చికిత్స చేయించే స్థోమత లేని నిరుపేద కుటుంబం
- పాఠశాల టీచర్ చొరవ.. ఫేస్‌బుక్‌లో పోస్టు
- స్పందించిన ఎన్ఆర్ఐలు.. దాతల సాయంతో పునర్జన్మ

6

కొత్త బస్సులు కావాలండోయ్!

- మహిళల ఉచిత బస్సు పథకానికి ఆర్టీసీ సన్నాహాలు
- ఎన్టీఆర్ జిల్లాలో 70, కృష్ణా జిల్లాలో 14 బస్సులకు ప్రతిపాదన



8

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాల్సిందే

- కలెక్టర్ బాలాజీ

3 పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం

మచిలీపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మూడు పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం)లకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వీరు ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొంది. మచిలీపట్నం సౌత్ మండలం నెలకుర్రు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా వక్కపట్ల శ్రీనివాసరావు, సభ్యులుగా జడ్డు జగ్గారావు, గోపిశెట్టి వెంకటసుబ్బారావు నియమితులయ్యారు. మొవ్వ మండలం చినముత్తేవి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా కొసరాజు ప్రకాష్ మాధుర్, సభ్యులుగా మురారి శివనాగరాజు, మురారి శివనాగరాజు, అలాగే నందివాడ మండలం నందివాడ పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా కోనేరు వెంకటేశ్వరరావు, సభ్యులుగా చొక్కా సుబ్బారావు, గంధి వెంకట సత్యనారాయణను ప్రభుత్వం నియమించింది.



పేర్ని నాని దిష్టిబొమ్మ దహనం

పదేపదే విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తూ కార్యకర్తలను రెచ్చగొడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని దిష్టిబొమ్మకు చల్లపల్లిలో టీడీపీ నాయకులు శవయాత్ర నిర్వహించి, ప్రధాన సెంటర్లో దహనం చేశారు. బియ్యం దొంగ పేర్ని నాని అంటూ పోస్టర్లు ప్రదర్శించారు. 6లో

ఊపిరి పోసిన ఫేస్‌బుక్ సందేశం



ఇంటర్ చదువుతున్న ధనుష్ (ఫైల్)





చికిత్స సమయంలో ధనుష్

- రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థికి తీవ్ర గాయాలు
- రెండు శస్త్ర చికిత్సలు చేస్తే కానీ బతికే పరిస్థితి లేదు
- చికిత్స చేయించే స్థోమత లేని నిరుపేద కుటుంబం
- పాఠశాల టీచర్ చొరవ.. ఫేస్ బుక్‌లో పోస్టు
- చికిత్సకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థ ..
- స్పందించిన ఎన్‌ఆర్‌ఐలు.. దాతల సాయంతో పునర్జన్మ

టీచర్ ఫేస్‌బుక్ సందేశం విద్యార్థి ప్రాణం నిలిపింది.. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మెదడు బయటకు వచ్చి కోమాలోకి వెళ్లిపోయిన విద్యార్థికి పునర్జన్మను ప్రసాదించింది.. రెండు సర్జరీలు చేస్తే తప్ప బతికే అవకాశం లేదని వైద్యులు పేర్కొనడంతో ఆ నిరుపేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉండగా.. బాలుడు చదివిన పాఠశాల టీచర్ తనవంతు సాయంతో పాటు.. ఫేస్‌బుక్‌లో ప్రకటనతో ఎన్నారైలు స్పందించారు. సుమారు రూ.ఎనిమిది లక్షలు అందజేశారు. శస్త్రచికిత్సలు విజయవంతం కాగా విద్యార్థికి ఊపిరి పోశారు. కొడుకు ప్రాణాలు నిలిపి ఫేస్‌బుక్ తమకు పెద్ద దిక్కుగా మారిందని ఆ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది.

(ఆంధ్రజ్యోతి, విస్సన్నపేట)

విస్సన్నపేట మండలం నర్సాపురంలో పాలకొల్లు ధనుష్ (17) స్థానిక జడ్పీ హైస్కూల్లో పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. వేసవి సెలవుల్లో కూలిపనులకు వెళ్లి కూడబెట్టిన డబ్బులతో విస్సన్నపేటలో ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఈ ఏడాది మార్చిలో తొలి సంవత్సరం పరీక్ష రాసి తిరిగి ఇంటి వస్తుండగా మోటార్ బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన దెబ్బతగిలి మెదడు బయటకు వచ్చింది. అధిక రక్తస్రావంతో కోమాలోకి వెళ్లిపోయాడు. కూలిపనులు చేసుకుంటున్న అతని తల్లిదండ్రులు విద్యార్థిని విజయవాడలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చేర్పించారు. తలకు రెండు మూడు సర్జరీలు పడతాయని రూ.6 నుంచి రూ.8 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో వారికి ఏంచేయాలో దిక్కుతోచలేదు. విషయం తెలుసుకున్న ధనుష్ చదివిన పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు శ్రీధర్‌బాబు తనవంతుగా రూ.10 వేలు సాయం చేశాడు. విద్యార్థి దీన పరిస్థితిని ఫేస్‌బుక్‌లో షేర్ చేయడంతో ప్రసారమాధ్యమాల్లో విషయం తెలుసుకున్న భైరవి ఫౌండేషన్ ఛారిటి సంస్థ నిర్వాహకులు కోగంటి కల్యాణి (ఎన్నారై) సహాయం అందించేం



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు



శ్రీధర్ (టీచర్)



గ్రామ ప్రముఖుడు (బుడ్డయ్య)

దుకు ముందుకు వచ్చి రూ.3 లక్షలు తక్షణ సాయంగా అందజేశారు. శ్రీధర్ మాస్టర్‌తో పాటు ఆయన స్నేహితులు, మరికొన్ని స్వచ్ఛంద సంస్థలు మరో రూ.3 లక్షలు సాయం చేశారు. గ్రామ ప్రముఖుడు గొట్టేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు (బుడ్డయ్య) ధనుష్ పరిస్థితి చూసి చలించిపోయి పిన్నమనేని ప్రభుత్వాసుపత్రిలో శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేయించారు. ధనుష్‌కు మార్చి నాలుగోతేదీన, ఒకసారి, ఏప్రిల్ 17వ తేదీన మరో సర్జరీని వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. చికిత్సల అనంతరం ధనుష్ పూర్తిగా కోలుకోవడంతో అతడి కుటుంబసభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛంద సంస్థల సహకారం.. ఉపాధ్యాయుడి చొరవ.. ఫేస్‌బుక్ స్పందన.. తమ బిడ్డకు పునర్జన్మ ప్రసాదించాయని కొనియాడారు.



చాగంటి కోటేశ్వరరావు దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్, అర్చకులు

దుర్గమ్మ సేవలో చాగంటి కోటేశ్వరరావు

ఇంద్రకీలాద్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దేవస్థానంలో కనకదుర్గమ్మను సోమవారం ప్రముఖ పురాణ ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడం) చాగంటి కోటేశ్వరరావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చాగంటి దంపతులు మల్లేశ్వరస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈవో శీనానాయక్, అర్చకులు, వేదపండితులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి వేద పండితులు ఆశీస్సులు, అనంతరం వారికి అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



దాతలు కరిపినేని నాగేశ్వరరావు, ఘట్టమనేని నవీన్‌కుమార్‌లకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

దుర్గగుడిలో అన్నవితరణకు విరాళాలు

ఇంద్రకీలాద్రి : దుర్గమ్మ సన్నిధిలో అన్నప్రసాద వితరణకు విజయవాడ, కానూరు తాడిగడపకు చెందిన దివంగత కరిపినేని శివరామకృష్ణారావు కుటుంబీకులు కరిపినేని నాగేశ్వరరావు రూ.1,11,116లు, నవీన్ కుమార్ ఘట్టమనేని వారి తల్లిదండ్రులు ఘట్టమనేని రాజగోపాల్, రుసూద్ర పేరున రూ.1,20,000లు విరాళంగా అందజేశారు. సోమవారం దాతలు ఈవో ద్వారా విరాళాలను సమర్పించారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద పండితులు ఆశీస్సులు అందచేశారు.

దుర్గగుడి ఫైర్ సేఫ్టీ ఆడిట్‌పై నివేదిక

ఇంద్రకీలాద్రి : నిత్యం వేలాది మంది భక్తుల భద్రత దృష్ట్యా దుర్గగుడిలో ఫైర్ సేఫ్టీ ఆడిట్‌పై ఈవో శీనానాయక్ లేఖ మేరకు సోమవారం అగ్నిమాపక శాఖ అధికారులు నివేదిక ఇచ్చారు. ఈనెల 11న అధికారుల బృందం, ఇంజనీరింగ్ అధికారుల బృందం ఆలయాన్ని పరిశీలన చేసింది. దీనిపై అధికారులు నివేదికను సమర్పించారు. మహామండపం, లడ్డూ తయారీ, అన్న ప్రసాదం, అమ్మవారి నైవేద్యం వంటశాల వంటి కీలకమైన ప్రదేశాల్లో తగుజాగ్రత్తలు తీసుకోవాలని నివేదికలో సూచించారు. ఆయా పనుల అమలుకు టెండర్లు పిలవాలని ఇంజనీరింగ్ అధికారులను ఈవో ఆదేశించారు.



కెనాల్ రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలు, మినీ బస్సుకు రుసుము రూ.200 వసూలు చేసిన రశీదు

కెనాల్ రోడ్డులో పార్కింగ్ దందా!

- నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు
- ప్రశ్నించిన వారిపై కాంట్రాక్టర్ సిబ్బంది దౌర్జన్యం

వన్‌టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ కెనాల్‌రోడ్డు పార్కింగ్‌లో సదరు కాంట్రాక్టర్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా వాహనదారుల నుంచి రుసుము వసూలు చేస్తున్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే సిబ్బంది దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, దీనిపై సంబంధిత వీఎంసీ ఎస్టేట్ అధికారులు, సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వినాయకుడి గుడి నుంచి కెనాల్ రోడ్డులో నూతనంగా నిర్మించిన వంతెన వరకు కార్పొరేషన్ అధికారులు వాహనాల పార్కింగ్‌కు విద్యాధరపురానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. నిబంధనల ప్రకారం.. బైక్‌కు మూడు గంటలకు రూ.10, కారు, గూడ్స్ వాహనాలకు రూ.30లు, తుఫాన్ వాహనానికి రూ.50లు, ఆటోకు రూ.20లు చొప్పున వసూలు చేయాలి. అయితే కాంట్రాక్టర్ కారు, గూడ్స్ ఆటోలకి మూడు గంటలకు రూ.100లు, టూరిస్టు బస్సులు, మినీ బస్సులు, తుఫాన్ వాహనాలకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారు. అదనపు వసూళ్లపై ప్రశ్నించిన వాహనదారులతో కాంట్రాక్టర్ సిబ్బంది బెదిరింపులకు దిగుతున్నారు. ఇటీవల ఓ వ్యాపారికి ఐరన్ సెంటర్‌లో ఉన్న షాపులోని సరుకులను గూడ్స్ ఆటో ద్వారా చెన్నైకి పంపించేందుకు ప్రయత్నించాడు. కెనాల్ రోడ్డులో గూడ్స్ ఆటో బ్రేక్ ఫెయిలైంది. ఆటో డ్రైవర్, సిబ్బంది వాహనాన్ని వినాయకుడి గుడి వెనుక పార్కింగ్ చేశారు. రెండ్రోజుల తరువాత వాహనాన్ని తీసుకోవటానికి ప్రయత్నించగా, వారిని కాంట్రాక్టర్ సిబ్బంది రుసుము కింద రూ.3వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధితులు ప్రశ్నించగా కాంట్రాక్టర్ సిబ్బంది వారితో గొడవపడ్డారు. పార్కింగ్‌లో అధిక వసూలు వ్యవహారం సంబంధిత వీఎంసీ ఎస్టేట్ అధికారులకు తెలిసి కూడా పట్టించుకోవటం లేదని కెనాల్ రోడ్డులోని పలువురు వ్యాపారస్తులు, దుర్గగుడికి వచ్చే భక్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై వీఎంసీ ఎస్టేట్ అధికారిని ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

చెరువు తవ్వకాలను అడ్డుకోండి

- కలెక్టర్‌కు మూడు గ్రామాల రైతుల ఫిర్యాదు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దాలిపర్రు రైతులు



రైతుల సమక్షంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్/చల్లపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి మండలం చింతలమడ పరిధిలో చెన్నకేశవకోడు పక్కనే జరుగుతున్న రొయ్యల చెరువు తవ్వకం పనులను అడ్డుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ డికె.బాలాజీకి రైతులు వినతిపత్రం సమర్పించారు. మాజీ డీసీ ఛైర్మన్ వీరమాచనేని భవానీప్రసాద్‌తోపాటు ఆయా గ్రామాల రైతులు సోమవారం కలెక్టర్‌ని కలిశారు. 2008లో కేసీపీ, రైతులు కలిసి చెన్నకేశవకోడును తవ్వించుకున్నామనీ, గుండేరు, చిల్లలవాగు నీటిపై ఆధారపడి చింతలమడ, ఘంటసాల, దాలిపర్రుకు చెందిన సుమారు 200 మంది రైతులు 300 ఎకరాలను ఆయిల్ ఇంజన్లు, మోటార్ల సహాయంతో సాగుచేసుకుంటున్నారని తెలిపారు. చెన్నకేశవకోడు పక్కనే డ్రెయినేజీ పోరంబోకు భూమిలో రొయ్యల చెరువు తవ్వి కట్టలు పోస్తున్నారనీ, పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రొయ్యల చెరువు సాగుచేసి ఆ చెరువునీటిని మురుగుకోడులోకి వదిలితే ఆ నీటిపై ఆధారపడి సాగుచేస్తున్న తమ పంటపొలాలు బీడుభూములుగా మారిపోతాయని చెప్పారు. రొయ్యల చెరువు తవ్వకం, కట్టలు పటిష్టపరిచే పనులను నిలుపుదల చేసే తక్షణం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలను సావధానంగా ఆలకించిన కలెక్టర్ తక్షణమే స్పందించారు. రైతుల ఎదుటే సంబంధిత రెవెన్యూ, డ్రెయినేజీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగు ఆదేశాలిచ్చారు. ఆందోళనలో దేవినేని ఓంకార్, సూరపనేని వెంకటేశ్వరరావు, సూరపనేని శివకుమార్, గొర్రెపాటి కుటుంబరావు, వేమూరి రామ్మోహనరావు, బోనం నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

దాలిపర్రు మేజర్ పంచాయతీకి ఈవోను నియమించండి

కృష్ణాజిల్లాలోని మేజర్ పంచాయతీ దాలిపర్రుకు ఆర్నెల్లుగా ఈవో, గుమాస్తాలు లేరని, వెంటనే ఈవోను నియమించాలంటూ కలెక్టరేట్ వద్ద సోమవారం దాలిపర్రు రైతులు ధర్నా నిర్వహించారు. దాలిపర్రు పంచాయతీలో ఈవో లేకపోవడంతో గ్రామస్థులు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న రామానగరం పంచాయతీకి వెళ్లి సమస్యలను చెప్పుకోవాల్సి వస్తోందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

- కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి, త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి ఆయన ప్రజలనుంచి 194అర్జీలను స్వీకరించారు. గుడివాడకు చెందిన దివ్యాంగుడు కొడాలి పోతురాజు కు సీపీవో కార్యాలయం సీఎస్ఆర్ నిధులు రూ.1.15లక్షలతో టీవీఎస్ జెస్ట్ మ్యాటీ వాహనాన్ని కలెక్టర్ అందజేశారు. అనంతరం కలెక్టర్ మట్లాడుతూ, ఈనెల 16న మచిలీపట్నంలోని ఆంధ్రాజాతీయ కళాశాలలో జాబ్‌మేళా కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని అధికారులకు సూచించారు. జాబ్ మేళాకు సంబందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో కన్నమనాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణారావు, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నటరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

18న జడ్పీ సంఘాల సమావేశాలు

ఈనెల 18న జిల్లాపరిషత్ స్థాయిసంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్టు జడ్పీ సీఈవో కన్నమనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న ఉదయం 10గంటలనుంచి స్థాయిసంఘాల సమావేశాలు ప్రారంభమవుతాయని, అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

చుక్కాని లేని నావలా విద్యావ్యవస్థ పనితీరు

- సమస్య పరిష్కరించకుంటే వినూత్న నిరసన : ఏపీసీపీఎస్ఈఏ

గాంధీనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా వ్యవస్థ పనితీరు చుక్కాని లేని నావలా ఉందని ఏపీసీపీఎస్ఈఏ అధ్యక్షుడు, జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ బాజీ పఠాన్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. విద్యావ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్న ఉపాధ్యాయులను గత ఆరేళ్లుగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఏడాది 10 పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకానికి హాజరుకాని వారికి మెమోలు ఇస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఆరోగ్యం సహకరించకపోయినా సుదూరం ప్రయాణించి ఉపాధ్యాయులు మూల్యాంకనానికి హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన 10 పరీక్షల మూల్యాంకన విధులు నిర్వహించిన వారికి ఇప్పటివరకు పారితోషికం చెల్లించకపోవడం విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. దీనిపై అనేకసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని లేదంటే వినూత్నంగా నిరసన తెలుపుతామని జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ కరిమి రాజేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు సీహెచ్.కిరణ్, ఎస్వీ జనార్ధన్‌రెడ్డి, జమీర్ అబ్బాస్, శాంతాబాయిలు ఆ ప్రకటనలో హెచ్చరించారు.

డొంకరోడ్డు ఆక్రమణ!

(5వ పేజీ తరువాయి)

గమనార్హం. గతంలో 30 మీటర్ల వెడల్పుతో ఉండి మూడు ట్రాక్టర్లు ఎదురుగా వచ్చినా తప్పుకునేంత స్థలం ఉండేదని, నేడు ఈ దారి 10 మీటర్లలోపు కుచించుకుపోయిందని పలువురు రైతులు చెబుతున్నారు. ఈ రోడ్డుకు ఒకవైపున పంట కాలువ ఉండటంతో ట్రాక్టర్లు ఆవైపునకు వెళితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేస్తే ఎంత భూమి ఆక్రమణలకు గురయ్యిందనే విషయం తెలుస్తుందని రైతులు అంటున్నారు. పోలిమెట్ల-కొమరవోలు సరిహద్దున ఉన్న డొంకరోడ్డును పరిశీలించి, ఆక్రమణకు గురైన భూమిని విడగొట్టాలని రైతులు కోరుతున్నారు.

కొటేషన్లలో కొట్టేశారు..!


(5వ పేజీ తరువాయి)

కొనాలన్నా కచ్చితంగా కొటేషన్ పిలవాల్సిందే. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలంటే కనీసం పది సంస్థలకు పైగా కొటేషన్స్ పిలవాలి. ఈ కొటేషన్స్‌కు ప్రభుత్వ పోస్టల్ స్టాంప్స్ అంటించి, డిస్పాచ్ రిజిస్టర్‌లో ఏ తేదీన పంపించిందీ ఎంటర్ చేసి, పోస్ట్ ద్వారా ఆయా సంస్థలకు పంపించాలి. అర్జెంట్ అయితే, మెయిల్ ద్వారా అయినా పంపించాలి.

దోపిడీ ఇలా..

పై నిబంధనలను వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన అధికారిగా ముద్రపడిన వైద్యాధికారి ఖాతరు చేయలేదు. ఆయన హయాంలో కొనుగోళ్లన్నింటినీ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారు. కొన్ని సంస్థలతో లాలూచీ పడి అడ్డగోలుగా కొటేషన్స్ పిలిచారన్న ఆరోపణలు ఉన్నాయి. లాలూచీ పడిన సంస్థల ద్వారా మూడు కొటేషన్స్ స్వీకరించేవారని తెలుస్తోంది. ఒకటి అసలు సంస్థ కాగా, రెండు, మూడు.. డమ్మీ కొటేషన్లు తీసుకునేవారు. తమకు కావాల్సిన పర్సంటేజీలు అన్నీ కూడా ముందే మాట్లాడుకునేవారని తెలుస్తోంది. వారికి నచ్చిన సంస్థ మూడు వేర్వేరు రేట్లతో కొటేషన్లు వేయగా, సీన్‌ను మరింత రక్తి కట్టించేవారు. ముందుగా అనుకున్న ప్రకారం ఏ సంస్థ ఎంత కోట్ చేయాలన్నది నిర్దేశించుకునేవారు. ఏ సంస్థకు పని అప్పగించాలో కూడా నిర్ణయించుకునేవారు. ఒక్క సంస్థ మాత్రమే రేటును తగ్గించిందని దాని పేరు రాసుకునేవారు. ఆ సంస్థకు కొనుగోళ్ల ఆర్డర్ ఇవ్వాలని నిర్ణయించేవారు. ఆ తర్వాత కొనుగోళ్ల ఆర్డర్ జారీ చేసేవారు. ఆసుపత్రి అవసరాలకు కొన్న, మరమ్మతులు చేసిన ప్రతి అంశంలోనూ ఇదే పద్ధతిని అవలంబించారు. ఇలా కావాల్సిన సంస్థలకు తప్ప.. బయటి సంస్థలకు ఆర్డర్లు దక్కేవి కావు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) నిబంధనలను అడ్డుపెట్టుకుని సీసీ కెమెరాల ఏర్పాటులో కూడా భారీ ఎత్తున అవినీతికి పాల్పడినట్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు అందింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే జరిగిన అక్రమాలు, అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

భవానీ ద్వీపంలో.. ఆక్రమణలు!



(5వ పేజీ తరువాయి)

ద్వీపంలా కనిపిస్తుంది. ఎందుకంటే ఈ రెండింటిని కృష్ణానది విడదీస్తుంది. వాస్తవానికి అది కూడా పశ్చిమ దిక్కున భవానీ ద్వీపంతో అనుసంధాన మవుతుంది. ఈ భాగంలో ఈ భారీ ఆక్రమణను గుర్తించారు.

సర్వే ఎందుకు చేశారు ? ఎలా గుర్తించారు?

భవానీ ద్వీపంలో వినియోగంలో లేని భూమిలో పర్యాటకాభివృద్ధిని పెంపొందించటం కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఏపీటీడీసీ అధికారుల మీద ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది. దీనిని ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, ఛైర్మన్ నూకసాని బాలాజీలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో వినియోగంలో లేని భూములను గుత్తంగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే బదులు.. వాటిని గుర్తించి, వాటిలో ప్రభుత్వ, పీపీపీ విధానంలో అమ్యూజ్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. దీని కోసం ఏపీటీడీసీ ఎండీ ఆదేశాలతో కొద్ది రోజులుగా అధికారులు సర్వే జరుపుతున్నారు. ఈ సర్వేలో ఆక్రమణలు వెలుగు చూశాయి. ఈ ఆక్రమణల విషయం ఎండీ దృష్టికి కూడా వచ్చింది. ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది.



చల్లపల్లిలో పేర్నినాని దిష్టిబొమ్మతో శవయాత్ర చేస్తున్న టీడీపీ నేతలు

పేర్ని నాని వ్యాఖ్యలపై టీడీపీ నేతల ఆగ్రహం

- చల్లపల్లిలో పేర్ని నాని దిష్టిబొమ్మకు శవయాత్ర, దహనం

చల్లపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని విద్వేషపూరిత వ్యాఖ్యలపై చల్లపల్లి టీడీపీ నేతలు భగ్గుమన్నారు. మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం చల్లపల్లిలో పేర్ని నాని దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి ప్రధాన సెంటర్లో దహనం చేశారు. బియ్యం దొంగ పేర్ని నాని అంటూ పోస్టర్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్ష కార్యదర్శులు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, జిల్లా తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి తాడికొండ చిన్నాలు మాట్లాడుతూ, రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేయాలనే జగన్ కుట్రలో భాగంగానే పేర్ని నాని రెచ్చగొట్టే మాటలతో పేట్రేగిపోతున్నారని విమర్శించారు. వైసీపీని ప్రజలు ఇంటికి పంపి 11 సీట్లకు పరిమితం చేసినా సిగ్గులేకుండా రాష్ట్రంలో అలజడులకు ప్రణాళికలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకోవాలని, నాని వ్యాఖ్యలపై పోలీసులు తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, లోకేశ్, పవన్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు నాదెళ్ల వెంకట నరసయ్య, మోర్ల శివ, వాసిరెడ్డి రాకేష్, మల్లంపల్లి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాల రాముపై కేసు నమోదు



గాయపడిన తెలుగుమహిళ నాయకురాలు మదాల సునీత

గుడివాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పెడన ఇన్‌చార్జ్ ఉప్పాల రాముపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక నాగవరప్పాడు వంతెన వద్ద శుక్రవారం కారు ఢీకొట్టడంతో తనకు గాయాలయ్యాయని, ఢీ కొట్టడమే కాకుండా కారులో ఉన్న జెడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక భర్త, వైసీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము, మరో నేత కందుల నాగరాజులు అసభ్యకరంగా తనను దూషించారని తెలుగు మహిళ నాయకురాలు మాదాల సునీత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆమె స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సునీత ఫిర్యాదు మేరకు సెక్షన్ 129(ఎ), 79 రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ కింద ఉప్పాల రాముతో పాటు మరికొందరు వైసీపీ నాయకులపై సోమవారం కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.



ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ప్రారంభిస్తున్న స్టాలిన్‌బాబు

మార్కెట్లోకి హీరో విడా ఈవీ స్కూటర్

విజయవాడ సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి) : అధునాతన ఫీచర్లతో మార్కెట్‌లోకి నూతనంగా విడుదలైన హీరో విడా ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని స్టాలిన్ స్వర్ణ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ డి.స్టాలిన్‌బాబు అన్నారు. పాయకాపురంలోని హీరో ఆథరైజ్డ్ డీలర్ సాయి స్వర్ణ మోటార్స్‌లో విడా వీఎక్స్-2 మోడల్ ఈవీ స్కూటర్‌ను ఆయన సతీమణి స్వర్ణకుమారితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాలిన్‌బాబు మాట్లాడుతూ, రిమూవబుల్ బ్యాటరీస్ స్కూటర్ ప్రత్యేకతగా చెప్పారు. వాహనం ఎక్కడ పార్క్ చేసినా బ్యాటరీ తీసి చార్జింగ్ పెట్టుకునే వీలుంటుందని, ఈ విధమైన సౌకర్యం ఉన్న ఈవీ స్కూటర్ దేశీయ మార్కెట్‌లో ఇదే ప్రప్రథమని స్పష్టం చేశారు. రెండు వేరియంట్లలో ఏడు రంగుల్లో స్కూటర్ విజయవాడ పరిసర ప్రాంతాల ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో సాయిస్వర్ణ హుందాయ్ జీఎం భగత్‌సింగ్, సాయిస్వర్ణ హీరో జీఎం సోమేశ్వర్ పాల్గొన్నారు. తొలి స్కూటర్ కొనుగోలు దారుడికి తాళం అందజేశారు.

కిలేడీ సింగర్!

(5వ పేజీ తరువాయి)

సహాయం ఎక్కువ పొందవచ్చని ఉద్దేశంతో వివాహం చేసుకుందని తెలిసింది. అయితే ఆ వ్యక్తికి అప్పటికే వివాహమై పిల్లలు ఉన్నట్టు సమాచారం. దీంతో వారి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని అతడి స్నేహితులు చెబుతున్నారు. సింగర్ మాయలో పడి సుమారు అరడజను మంది మోసపోయారని పబ్‌కు వెళ్లే పలువురు పేర్కొంటున్నారు. కాగా, ఆమె కుమారుడు పుట్టినరోజు వేడుకను కొత్తపేటకు చెందిన వ్యక్తి భారీగా చేసినట్టు చెబుతున్నారు. సుమారు కోటి రూపాయలు విలువ చేసే బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు, నగదు ఇచ్చినట్టు అతడి స్నేహితులు బహిరంగంగానే చెబుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	99, 107, 118
చికెన్ విత్ స్కిన్	190
చికెన్ స్కిన్‌లెస్	200



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

తాడిగడప, కానూరులో డ్రెయిన్లు పరిశీలించిన కమిషనర్

కానూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ సోమవారం మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో సమావేశమయ్యారు. తాడిగడప- పెదపులిపాక వెళ్లే రోడ్డు శివారులో నిర్మాణంలో ఉన్న షాదీఖానాను ఆయన సందర్శించారు. పద్మజనగర్‌లో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉందని ఫిర్యాదు అందడంతో దానిని పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రెయినేజీలో పడవేయరాదని సూచించారు.



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ షేక్ నజీర్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కానుమోలు, రంగయ్యప్పారావుపేట, ఆరుగొలనులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను అన్ని విధాల అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కానుమోలు, రంగయ్యప్పారావుపేట, ఆరుగొలను గ్రామాల్లో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. రంగయ్యప్పారావుపేటలో నూతనంగా నిర్మించిన టీడీపీ జెండా స్థూపాన్ని ఆవిష్కరించి జెండా ఎగురవేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తూ సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా రైతుల భూములను లాక్కునేందుకు ప్రవేశపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేయడంతో రైతులకు ప్రయోజనం చేకూరిందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సకాలంలో సాగు నీరందించామన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారుల అభి వృద్ధితో పాటు కోట్లాది రూపాయల వ్యయంతో రంగయ్యప్పా రావుపేట రహదారిని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానన్నారు. రంగయ్య ప్పారావుపేటలో తాగునీటి సమస్య, బస్సు హాల్టు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తేగా అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దయాల రాజేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణ, పుట్టా సురేష్, మూల్పూరి సాయికళ్యాణి, చిరుమామిళ్ల సూర్యం, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, నల్లిబోయిన గోపాలకృష్ణ, కాటుమాల పృథ్వి, గుండపనేని ఉమావరప్రసాద్, మొవ్వా వేణుగోపాల్, పరుచూరి రామకృష్ణ, చలమలశెట్టి శివకుమార్, చలసాని శ్రీనివాస్, చింతల వెంకటశివ అప్పారావు, యజ్ఞవరపు వెంకటరంగారావు, కాటూరి విజయభాస్కర్, పీఏసీఎస్ అధ్యక్షులు దన్నే దుర్గారావు, బేతా సుజాత, వేగిరెడ్డి పాపారావు, మల్లికార్జునరావు, బేతా శేషుకుమార్, పాల్గొన్నారు.



కానుమోలులో సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఎక్కడెక్కడినుంచో..

- పుల్లేరు కాల్వలో వంతెనల వద్ద పేరుకుపోతున్న గుర్రపు డెక్క, వ్యర్థాలు
- తొలగింపులో ఇరిగేషన్ సిబ్బంది నిర్లక్ష్యం
- నీటి ప్రవాహానికి అడ్డుగా మారడంతో ఇబ్బంది పడుతున్న రైతులు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై వరినాట్లు జోరుగా సాగుతున్న నేపథ్యంలో పుల్లేరులో పేరుకుపోయిన గుర్రపు డెక్క నీటి ప్రవాహానికి అడ్డుగా నిలవడంతో కాల్వల ద్వారా పొలాలకు సాగునీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. కాల్వలకు నీరు వదలక ముందు డెక్క నిర్మూలనకు కంకిపాడు మండల పరిధి నుంచి ఉయ్యూరు లాకుల వరకు ఇరిగేషన్ అధికారులు డ్రోన్ ద్వారా మందు అరకొరగా పిచికారి చేయించారు. నీరు వదిలిన తరువాత ఎండిపోయిన డెక్కతో పాటు చావకుండా పచ్చగా ఉన్న డెక్క అంతాకలసి కొట్టుకు వచ్చి చినఓగిరాల నుంచి కంకిపాడు పరిధి వరకు కాల్వలో పేరుకుపోయి ప్రవాహానికి అడ్డుగా నిలుస్తుంది. పుల్లేరు ద్వారా ఉయ్యూరుతోపాటు చుట్టుపక్కల మండలాల గ్రామాల పరిధిలో వందలాది ఎకరాలలో రైతులు వరిసాగు చేస్తున్న పరిస్థితుల్లో చావకుండా మిగిలి ఉన్న డెక్క మరలా పెరిగి కాల్వంతా అలుముకుంటుందని, దీనితోపాటు ఎండిన డెక్కకూడా నీటి ప్రవాహానికి అడ్డుగా నిలుస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి డెక్క తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చినఓగిరాల వద్ద ..



పుల్లేరులో పెదఓగిరాల వంతెన సమీపాన పేరుకుపోయిన డెక్క, వ్యర్థాలు

జంక్షన్‌లో రైతుబజార్ ఏర్పాటు చేయాలి

హనుమాన్‌జంక్షన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జంక్షన్‌లో రైతు బజార్‌ను ఏర్పాటు చేయాలని సీపీఎం బాపులపాడు మండల కార్యదర్శి బేత శ్రీనివాసరావు సోమవారం ప్రకటనలో అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో గన్నవరం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ కూరగాయల మార్కెట్ నడుస్తున్నా.. ప్రజలకు సరసరమైన ధరలకు కూరగాయలు దొరకని పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రైవేట్ వ్యాపారస్తులు అధిక ధరలకు కూరగాయలు విక్రయించడం వలన సామాన్య ప్రజలకు ఇబ్బందిగా మారిందని ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రైతు బజార్ ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా చతుర్థి అభిషేకాలు

హనుమాన్‌జంక్షన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం సంకట హర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. మరకత లింగేశ్వరు డికి ఆలయ అర్చకుడు మేడూరి సతీష్‌శర్మ విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా, తమిరి రమేశ్, వీరమాచనేని నాగయ్య తదితరులు పర్యవేక్షించారు.





డీఎంహెచ్‌వో శర్మిష్ఠకు వినతిపత్రం అందజేస్తున్న నర్సులు

సమస్యలు పరిష్కరించాలి

డీఎం అండ్ హెచ్‌వోకు నర్సింగ్ ఉద్యోగుల వినతి

ఉంగుటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా వున్న కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్, ఉంగుటూరు పీహెచ్‌సీ స్టాఫ్‌నర్స్ బొకినాల సౌమ్యరేఖ ఆధ్వర్యంలో నర్సింగ్ ఉద్యోగులు సోమవారం మచిలీపట్నంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ శర్మిష్ఠను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ స్ట్రగుల్ కమిటీ నాయకులు విజయలక్ష్మి, సునీత, తులసి, కనకదుర్గ, మణి, శ్రీదివ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఈఎన్‌టీ శస్త్ర చికిత్స

కామినేనిలో ట్రోమాటిక్ ఫేషియల్ నెర్వ్ పాల్సీ సమస్యకు పరిష్కారం

విజయవాడ సిటీ, జూలై 14 : అరుదైన ఈఎన్‌టీ శస్త్ర చికిత్సను కామినేని ఆసుపత్రిలో విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఎన్.ఆర్.ఎస్.వర్ధన్ వెల్లడించారు. ప్రఖ్యాత చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ పి.సునీల్‌కుమార్ సాధించిన ఈ విజయంతో కామినేని ఆసుపత్రి మరో మైలు రాయిని దాటిందని స్పష్టం చేశారు. ఆపరేషన్ వివరాలను నగరంలోని ఇంద్రప్రస్థ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ వర్ధన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆసుపత్రిలోని న్యూరాలజీ విభాగంలో చేరాడని, ముఖం వంకర పోయి, కనురెప్పల్లో కదలిక లేకపోవడం వంటి లక్షణాలను వైద్యులు తొలుత గుర్తించారన్నారు. ప్రమాదానికి గురైనపుడు చెవి వెనుక భాగంలోని టెంపోరల్ బోన్ దెబ్బతిందని, ఈ బోన్ ముఖ భాగానికి సంబంధించి కీలక నరాన్ని నొక్కి వేయడంతో రోగి చాలా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఈ పరిస్థితిని ట్రోమాటిక్ ఫేషియల్ నెర్వ్ పాల్సీగా గుర్తించి పరిష్కారానికి అత్యంత ఖచ్చితమైన శస్త్ర చికిత్సను నిర్వహించామన్నారు. నాలుగు గంటలు శ్రమించి ఆపరేషన్‌ను పూర్తిచేసినట్లు తెలిపారు. దెబ్బతిన్న ఎముకను సరిచేసి ఒత్తిడికి గురవుతున్న నరాన్ని స్థితికి తీసుకొచ్చామన్నారు. డాక్టర్ సునీల్‌కుమార్ అద్భుతమైన నైపుణ్యం ఫలితంగా కేవలం 21 రోజుల్లో పేషెంట్ సాధారణ స్థితికి చేరుకున్నారని వివరించారు. ఈ సమావేశంలో కామినేని ఆసుపత్రి హెడ్ కె.ఆర్.రమణరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వర్ధన్

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి: కలెక్టర్

ఉయ్యూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల ఆవరణలో సోమవారం నిర్వహించిన క్రీడల సన్నద్ధ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యాసంస్థల్లో క్రీడల నిర్వహణ సౌలభ్యం నిమిత్తం రంగు రంగుల విభాగాల వారిగా విభజించి వారి బృందానికి నాయకులుగా నియమితులైన వారికి నియామకపత్రాలు అందించి అభినందించారు. విద్యాసంస్థల చైర్మన్ మాదల సుబ్రమణ్యేశ్వరరావు,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సూర్యశేఖర్, సుష్మ, ప్రిన్సిపాల్ పద్మజావాణి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

సప్త దర్శని.. మన అమరావతి దేవాలయాలు

కానూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : సప్త దర్శని- మన అమరావతి దేవాలయాలు పేరుతో విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నుంచి ప్రతి ఆదివారం ఉదయం 6గంటలకు సూపర్ లగ్జరీ నాన్ ఏసీ పుష్ బ్యాక్ బస్సు బయలుదేరుతుందని ఆటోనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కె. ప్రవీణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టిక్కెట్స్ apsrtc online.inలో గాని లేదా ఏపీఎస్ ఆర్టీసీ బుకింగ్ కౌంటర్ వద్ద గాని సర్వీస్ నెంబరు 95290తో బుక్ చేసుకోవాలని తెలిపారు. వివరాకు 7382900337 నెంబరు సంప్రదించాలని డీఎం పేర్కొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలకు చెక్

పెనమలూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు పెదపులిపాకలో ఇసుక అక్రమ రవాణాదారుల ఆగడాలకు అధికారులు చెక్ పెట్టారు. ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తున్న దారిలో జేసీబీతో గండి కొట్టారు. గ్రామ వీఆర్వో, ఆర్ఐలు క్వారీ ప్రాంతానికి వచ్చి పరిశీలించి తగుచర్యలు చేపట్టారు. అక్రమంగా ఇసుకను తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. నెలన్నర కిందట గ్రామస్థులు కొన్నేళ్లుగా క్వారీపై హైకోర్టు స్టే ఉందని, అయినా ఇసుక రవాణాదారులు ఇసుకను తరలిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా... వెంటనే అధికార యంత్రాంగం రెవెన్యూ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఇసుక క్వారీ వద్ద గండి కొట్టి ఇసుక రవాణాను నిలుపుదల చేశారు.



యూటీఎఫ్ సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

గన్నవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు ఉపాధ్యాయులందరూ సమష్టిగా ముందుకు రావాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ అన్నారు. యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడంతోపాటు రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యారంగా సమస్యలపై నిరంతరం యూటీఎఫ్ పోరాడుతూనే ఉంటుందన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జి.వి. రవిబాబు, జి. రాజబాబు, తాతా శ్రీనివాస్, దాసరి నవభారతి, బి.జ్ఞానానందం, సీహెచ్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజుపాలెంకు బస్సు సర్వీసు

గన్నవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్కూల్, కాలేజీ విద్యార్థుల సౌకర్యం కోసం గన్నవరం డిపో నుంచి ముదిరాజుపాలెంకు ఉదయం, సాయంత్రం బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పి. శివాజీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్సు ఏర్పాటుకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచనలు చేశారని, ఆయన సూచ నల మేరకు పురుషోత్తపట్నం, కొండపావులూరు, గోపవరపుగూడెం, కట్టుబడిపాలెం, ముదిరాజుపాలెం విద్యార్థులు, ప్రయాణికులు ఈ బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఉవ్వెత్తున మంటలు.. దట్టమైన పొగ

భయాందోళనలో కేసీపీ లక్ష్మణ్ నగర్ కాలనీ వాసులు

ఉయ్యూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కేసీపీ లక్ష్మణ్ నగర్ కాలనీలో సోమవారం ఉవ్వెత్తున మంటలు లేచి దట్టమైన పొగ అలు ము కోవడంతో పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కాలనీలో ఓ పక్కన ఖాళీగా ఉన్న ప్రదేశంలో చెత్తకు నిప్పంటుకుని పక్కన ఉన్న పొదలు, మొక్కలు చెట్లకు వ్యాపించడంతో మంటలు దావనంలా వ్యాపించి ఆప్రాంతమంతా చుట్టు ముట్టాయి. అక్కడే ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలకు మంటలు అంటుకుని దట్టమైన పొగ అలుముకుని ఆప్రాంతాన్ని కమ్మివేసింది.



మీది విధ్వంసం.. మాది అభివృద్ధి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మీ నాయకుడు, మీరు గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజలకు విధ్వంసం చూపించారు.. మా నాయకుడు మాకు అభివృద్ధి ఎలా చేయాలో నేర్పించారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరులో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అనూష, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, తుమ్మలపల్లి హరికృష్ణ, సర్పంచ్ ఈడే శివనాగలక్ష్మి, ఈవో రామకృష్ణ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పావనమూర్తి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఈడా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడు సొసైటీ చైర్మన్‌గా సుంకర శివతో తొలి సంతకం చేయిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

రైతులకు అందుబాటులో ఉండండి

రైతులకు అందుబాటులో ఉంటూ బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని కంకిపాడు, ప్రొద్దుటూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ సభ్యులతో సోమవారం ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. కంకిపాడు సొసైటీ చైర్‌పర్సన్ సుంకర శివ, సభ్యులుగా గోళ్ల జయరాం, తొడాసుల నాగేశ్వరరావు, ప్రొద్దుటూరు చైర్‌పర్సన్ ఈడ వెంకట కృష్ణారావు, సభ్యులుగా పడమట కుమారస్వామి, ఈడా కృష్ణమూర్తిలతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనమలూరు చెంచుల కాలనీలో..

పెనమలూరు: టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి దోహదం చేస్తాయని టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్ ప్రసాద్, క్లస్టరు ఇన్‌చార్జి మారుపూడి ధనకోటేశ్వరరావులు పేర్కొన్నారు. సోమవారం పెనమలూరు చెంచుల కాలనీలో వారు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తోటకూర ఉదయభాస్కర్, షేక్ సుభాని, మోర్ల నరేంద్ర, యలమంచిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవభక్తుని వ్యాఖ్యలు హాస్యాస్పదం..

నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని టీడీపీ నేతలు శొంఠి శివరాంప్రసాద్, మొక్కపాటి శ్రీనివాస్‌లు విమర్శించారు. సోమవారం యనమలకుదురులో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తాడిశెట్టి వీరాస్వామి, బలగం నాగరాజు, ఎడ్లపల్లి సురేష్, బలుసుపాటి బూసి, ధరావత్ సోనీ, సంపర శేఖర్, బుక్యా రాజా తదితరులు పాల్గొన్నారు.

35వ డివిజన్‌లో ..

తాడిగడప మునిసిపాలిటీ 35వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, పార్టీ పరిశీలకులు జువ్వాది రాంబాబులు స్థానికులకు అభివృద్ధిని వివరించే కరపత్రాలను అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో దోనేపూడి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.





పెనమలూరు చెంచుల కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు.. 35వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో యార్లగడ్డ సుచిత్ర

నున్నలో క్రికెట్ టోర్నమెంట్ నేడు, రేపు

విజయవాడస్పోర్ట్స్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ది ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డివిజనల్ ఆఫీస్ విజయవాడ ఆధ్వర్యంలో ఎఫ్‌సీఐ సౌత్‌జోన్ 8వ ఇంటర్ రీజనల్ క్రికెట్ టోర్నమెంట్ నున్నలోని గ్రీన్‌హిల్స్ ఎరీనాలో మంగళ, బుధవారాలలో జరగనుంది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో ఆంధ్రా, తెలంగాణ, కేరళ, తమిళనాడు, జోనల్ ఆఫీస్ సౌత్ జట్లు పాల్గొననున్నాయి. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సౌత్) జసింతా లాజరస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

ఉయ్యూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్రం (బోటనీ) గెస్ట్ లెక్చరర్ పోస్టుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్‌బీ రాజ్యలక్ష్మి తెలిపారు. 15 నుంచి కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చని 21న కళాశాలలో డెమో/ ఇంటర్వ్యూకు హాజరుకావలసి ఉంటుందని తెలిపారు.

ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

ఉయ్యూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని ఉయ్యూరు ఆర్డీఓ బి.హేలాషారోన్ బీఎల్వోలకు సూచించారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో సోమవారం మండలంలో బూత్‌లెవల్ ఆఫీసర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బీఎల్వోలకు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హేలాషారోన్

కొత్త బస్సులు కావాలండోయ్!

మహిళల ఉచిత బస్సు పథకానికి ఆర్టీసీ సన్నాహాలు

● ఎన్టీఆర్ జిల్లాలో 70, కృష్ణా జిల్లాలో 14 బస్సులకు ప్రతిపాదన ● త్వరలోనే విజయవాడకు 100 ఎలక్ట్రికల్ బస్సులు
● తుది దశకు బాడీ బిల్డింగ్ పనులు ● విద్యాధరపురం డిపో కేంద్రంగా ఆపరేషన్ ● డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రికల్ బస్సులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో కొత్త బస్సుల అవసరాన్ని ఆర్టీసీ గుర్తించింది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి 84 కొత్త బస్సులను అధికారులు ప్రతిపాదించారు. ఎన్టీఆర్ జిల్లాలో 70, కృష్ణా జిల్లాలో 14 బస్సులు కావాలని నిర్ణయించారు. మొత్తంగా ఎన్టీఆర్ జిల్లాకు 150 బస్సుల అవసరం ఉండగా, ఇటీవల 80 కొత్త బస్సులు కొనుగోలు చేశారు. ఇవి బాడీ బిల్డింగ్ పూర్తి చేసుకుని విజయవాడకు చేరాయి, కానీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం జరిగింది. రిజిస్ట్రేషన్ తర్వాత జిల్లా డిపోలకు పంపించగా ప్రస్తుతం అవి నడుస్తున్నాయి. వీటిని మినహాయిస్తే మరో 14 బస్సుల అవసరాన్ని ఆర్టీసీ ఆర్ఎం



దానం గుర్తించారు. కృష్ణా జిల్లా పరిధిలో ఇప్పుడున్న బస్సులకు అదనంగా మరో 14 కొత్త బస్సుల అవసరాన్ని మచిలీపట్నం డీపీటీవో వెంకటేశ్వర్లు నిర్ణయించారు. ఈ ప్రతిపాదనలు విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ద్వారా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావుకు చేరాయి. ఉచిత పథకం ఏ బస్సుల్లో అమలవుతుందన్నది ఇంకా స్పష్టం కాలేదు. కానీ పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఖాయమని తెలుస్తోంది. బస్సుల సమీకరణ బాధ్యతను ప్రభుత్వం ఆర్టీసీకి అప్పగించింది. కొత్త బస్సులను కొనుగోలు చేయాలా, అద్దె ప్రాతిపదికన తీసుకోవాలా అన్నది ఆర్టీసీ అధికారులు చర్చిస్తున్నారు. ఒక నెలలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఆర్టీసీలో 40 శాతం బస్సులు అద్దెవి, ఇంతకు మించి అద్దె బస్సులు తీసుకుంటే ఉద్యోగ సంఘాల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అదనంగా, ఎలక్ట్రిక్ బస్సులు కూడా త్వరలో రానున్నాయి. దీంతో అద్దె బస్సుల సంఖ్య పెరుగుతుంది. అందుకే ఆర్థిక వనరులపై ఆర్టీసీ అధికారులు సమాలోచనలు జరుపుతున్నారు.



డీజిల్ బస్సులకు బై.. ఎలక్ట్రిక్ బస్సులకే జై..!

విజయవాడ నగర రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు అనతి కాలంలోనే తిరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఫేమ్-2 పథకం కింద 100 ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయి. ఇవి విద్యాధరపురం డిపో నుంచి నడుస్తాయి. బాడీ బిల్డింగ్ తుది దశలో ఉంది. ఆర్టీసీ అధికారులు పరిశీలించారు. విద్యాధరపురం డిపోలో చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు కానుంది. కానీ విద్యుత్ కనెక్షన్‌లో జాప్యం జరుగుతోంది. ఈ డిపోలోనే బస్సుల నిర్వహణ జరుగుతుంది. ఆర్టీసీ పరిధిలో డీజిల్ బస్సులు కనుమరుగవుతాయి. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం 15 ఏళ్లు దాటిన డీజిల్ బస్సులను స్క్రాప్‌కు పంపాలి. వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్టీసీ అధికారులు పీపీపీ విధానంలో ఎలక్ట్రిక్ బస్సులకు నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. 2029 నాటికి దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులు పూర్తిగా అమలులోకి వచ్చే అవకాశం ఉంది.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీపీ ఉదయరాణి

పోలీస్ కమిషనరేట్‌కు 83 ఫిర్యాదులు

విజయవాడ సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 83 ఫిర్యాదులను స్వీకరించినట్టు డీసీపీ ఏబీటీఎస్ ఉదయరాణి తెలిపారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఆమె వృద్ధులు, వికలాంగుల వద్దకు వెళ్లి నేరుగా ఫిర్యాదులు తీసుకున్నారు. ఆస్తి వివాదాలు, నగదు లావాదేవీలపై 51, కుటుంబ కలహాలపై మూడు, కొట్లాటలపై ఐదు, మోసాలపై రెండు, మహిళా సంబంధిత నేరాలపై ఆరు, సైబర్ నేరాలపై ఒకటి, చోరీలపై నాలుగు, చిన్న చిన్న ఘటనలపై 11 మంది ఫిర్యాదులు ఇచ్చినట్టు డీసీపీ వివరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన అనంతరం సదరు ఫిర్యాదులపై సంబంధిత స్టేషన్ అధికారులను ఫోన్‌లో సంప్రదించినట్టు తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలో ఫిర్యాదులను పరిష్కరించాలని స్టేషన్ అధికారులకు ఆమె ఆదేశాలిచ్చారు.

ప్లాస్టిక్ సర్జరీతో ఆత్మవిశ్వాసం

● ప్రముఖ ప్లాస్టిక్, రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్ ప్రతాప్ దుగ్గిరాల



విజయవాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ సర్జరీ అనేది కేవలం అందం పెంచడానికి మాత్రమే కాదు, ఒక వ్యక్తి శరీర ఆకృతి, జీవన నాణ్యతను తిరిగి తీసుకురావడానికి ఉపయోగపడే శాస్త్ర విభాగమని ప్రముఖ ప్లాస్టిక్, రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్ డాక్టర్ ప్రతాప్ దుగ్గిరాల అన్నారు. నేడు జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రమాదాలు, కాలిన గాయాలు, జనన లోపాలు, కేన్సర్ తర్వాత పునర్నిర్మాణ అవసరాలు వంటి అనేక సందర్భాల్లో ప్లాస్టిక్ సర్జరీ ఒక ఆశాజ్యోతి లాంటిదన్నారు. ప్రస్తుతం ప్లాస్టిక్ సర్జరీలు సమాజంలో శారీరక లోపం ఉన్న వారికి ఆత్మవిశ్వాసం కలిగిస్తున్నాయన్నారు. ప్రొఫెషనల్ నైపుణ్యంతో పాటు మానవీయతకు ప్రాధాన్యం ఇచ్చే వైద్యులు సమాజంలో అనేక మంది జీవితం మార్చగలుగుతారని ప్రతాప్ దుగ్గిరాల అన్నారు.


కారు దిగి నడుచుకుంటూ కోర్టుకు వెళ్తున్న వంశీ

ఉయ్యూరు కోర్టుకు మాజీ ఎమ్మెల్యే వంశీ

ఉయ్యూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జికోర్టుకు మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్ సోమవారం హాజరయ్యారు. గన్నవరం కోర్టు న్యాయమూర్తి సెలవులో ఉండటంతో ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరై సంతకం చేసేందుకు వంశీ వచ్చినట్టు సమాచారం. మందీమార్బలం లేకుండా ఒకరిద్దరు వెంటరాగా వంశీ కోర్టుకు హాజరయ్యారు.


ప్రీతమ్ రెడ్డికి డాక్టర్ కనకమేడల శ్రీనివాస్ కుమార్ స్మారక స్వర్ణ పతకాన్ని ప్రదానం చేస్తున్న డాక్టర్ రాధిక

డాక్టర్ ప్రీతమ్ రెడ్డికి స్వర్ణ పతకం

● ఇక ఏటా డాక్టర్ కనకమేడల స్మారకంగా ప్రదానం
● కాలేజీ ప్రిన్సిపాల్ ఏవై రావు

ప్రభుత్వాసుపత్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (ఎన్టీఆర్ యూహెచ్ఎస్) నిర్వహించిన ఎంఎస్ జనరల్ సర్జరీ పరీక్షల్లో విశ్వవిద్యాలయ టాపర్‌గా నిలిచిన డాక్టర్ టీవీఎస్ఎస్ ప్రీతమ్ రెడ్డికి విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాలలో డాక్టర్ కనకమేడల శ్రీనివాస్ కుమార్ స్మారకంగా స్థాపించిన స్వర్ణ పతకాన్ని ఆయన భార్య డాక్టర్ రాధిక సోమవారం అందించారు. ఈ ఏడాది అవార్డు అందుకున్న ప్రీతమ్‌కు పలువురు అభినందనలు తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఏవై రావు మాట్లాడుతూ ప్రతి ఏడాది జనరల్ సర్జరీ విభాగంలో ఉత్తమ పీజీ విద్యార్థికి ఈ పతకాన్ని ప్రదానం చేయబోతున్నట్టు తెలిపారు. సూపరింటెండెంట్ ఏ వెంకటేశ్వరరావు, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రాజ్‌కమల్, పీజీ విద్యార్థులు, కనకమేడల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కూచిపూడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ డీ సత్యనారాయణ తెలిపారు. ఇంగ్లీష్ సబ్జెక్టు బోధించటానికి ఇద్దరు, హిందీ ఒక్కరు, కామర్స్ ఒకేషనల్ ఖాళీ ఒకటి ఉన్నట్టు తెలుపుతూ ఆయా సబ్జెక్టులు బోధించేందుకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు గుర్తింపు పొందిన వర్సిటీల నుంచి ఆయా సబ్జెక్టుల్లో 50 మార్కులు సాధించాలన్నారు. ఈ నెల 16న బుధవారం సాయంత్రం 5 గంటలలోపు కళాశాల ప్రిన్సిపాల్‌కు దరఖాస్తులు అందించాలని తెలిపారు. 17న గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపల్ తెలిపారు.

జిల్లాస్థాయి యోగా పోటీలు 19న

ఉయ్యూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనుబంధ సంస్థ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అవనిగడ్డ ఆధ్వర్యంలో ఈనెల 19న గండిగుంట శ్రీగణపతి సచిదానంద జ్ఞాన బోధ సభ (దత్తాశ్రమం)లో జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గురువెల్లి కృష్ణ, ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఉదయం 8 నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, సీనియర్ ఏ, బీ, సీ విభాగాల్లో అన్ని కేటగిరీలకు పోటీలు జరుపబడతాయన్నారు. ఎంపికైనవారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని పొందుతారన్నారు. ఆసక్తిగలవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని పోటీల్లో పాల్గొనాలని, వివరాలకు 96502876748 నంబరులో సంప్రదించి గూగుల్ ఫామ్ ద్వారా దరఖాస్తు పొందవచ్చని, రిజిస్ట్రేషన్‌కు ఈనెల 17 చివరి తేదీగా పేర్కొన్నారు.

కుట్రలతో వైసీపీ గందరగోళం

● మాజీ మంత్రి దేవినేని ఉమా

గొల్లపూడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించగా, వైసీపీ కుట్రలతో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తోందని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి సాయిపురం కాలనీలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగులో పాల్గొని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ నేతలు ప్రజల మధ్యకు వెళ్లే ధైర్యం లేక పార్టీ మీటింగ్‌లు, ప్రెస్‌మీట్లలో కూర్చొని పిచ్చి కూతలు కూస్తున్నారన్నారు. పల్నాడు, బంగారుపాళ్యం, గుడివాడ వంటి ఘటనలు జగన్‌మోహన్ రెడ్డి కుతంత్రాల్లో భాగమేన్నారు. అహంకారం, మదంతో సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్న, మంత్రి కొల్లు రవీంద్ర వంటి నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సానుభూతి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. అమరావతిలో బిట్స్ పిలానీ క్యాంపస్ స్థాపన రాష్ట్రానికే గర్వకారణమన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సుపరిపాలన దిశగా పయనిస్తుందన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై కొనసాగుతున్న విచారణ

జి.కొండూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): [ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్] గడ్డమణుగు పంచాయతీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు డిప్యూటీ ఎంపీడీవో కొత్త శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. 'నిధుల స్వాహా' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈనెల 13న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీలో నిధులు గోల్‌మాల్ అయిన నేపథ్యంలో ఆయా సమయాల్లో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులతో అప్పటి రికార్డులను తీయించి పిన్ టూ పిన్ పరిశీలన చేస్తున్నామన్నారు. డీపీవో ఆదేశాల మేరకు ఈ పరిశీలన చేపట్టినట్టు చెప్పారు. పూర్తి పరిశీలనకు కొన్నిరోజులు సమయం పడుతుందని ఏ స్థాయిలో నిధులు గోల్‌మాల్ అయ్యాయో మొత్తం పరిశీలించి కానీ చెప్పలేమన్నారు.



ప్రసంగిస్తున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్

విలువలతో కూడిన నైపుణ్యాలు అలవర్చుకోవాలి

● హైకోర్టు మాజీ న్యాయమూర్తి కృపాసాగర్

కానూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విలువలతో కూడిన నైపుణ్యాలు అలవర్చుకోవాలి హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్ అన్నారు. కానూరులోని సిద్ధార్థ న్యాయ కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాలులో సోమవారం జరిగిన సమావేశంలో కృపాసాగర్ ముఖ్యఅతిథిగా హాజరై చట్ట, న్యాయపరమైన వృత్తిపై స్వీయ పరిశీలన అనే అంశంపై ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ దివాకర్‌బాబు అధ్యక్షత వహించగా డాక్టర్ కృపాసాగర్ మాట్లాడుతూ నైపుణ్యాలకు మెరుగులు అద్దడం, జ్ఞానాన్ని పొందడం ఒక నిరంతర యజ్ఞం వలే చేయాలని సూచించారు. న్యాయ విద్యార్థులపై ఎంతో బాధ్యత ఉంటుందని, సమాజ నిర్మాణంలో వారి పాత్ర ప్రముఖంగా ఉంటుందన్నారు. ప్రస్తుత కాలంలో కేవలం కళాశాల నైపుణ్యాలు మాత్రమే కాకుండా సాంకేతిక పరిజ్ఞానంలో కూడిన నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు వారి జీవిత ప్రయాణం ఒకసారి నిర్ణయించబడిన తరువాత వారి భవిష్యత్ ప్రణాళికలు నిర్ణయించుకోవడం మొదలుపెట్టాలని డాక్టర్ కృపాసాగర్ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ దివాకర్‌బాబు మాట్లాడుతూ కృపాసాగర్ తన జీవిత ప్రయాణంలో విద్యార్థి దశలోనూ, అధ్యాపక దశలోనూ న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారన్నారు. అనంతరం కృపాసాగర్‌ను ప్రిన్సిపాల్ దివాకర్‌బాబుతోపాటు అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

పేర్ని వ్యాఖ్యలతో శాంతిభద్రతలకు భంగం

● బండ్రెడ్డి రామకృష్ణ ఫైర్

పెడన, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నాని రౌడీ రాజకీయాలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నాడని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ ఆరోపించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ సమావేశాల్లో నాని ప్రజలు, కార్యకర్తలను రెచ్చగొట్టేలా మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాడని దుయ్యబట్టారు. వైసీపీ పాలనలో సాగిన దాష్టీకాన్ని కూటమి ప్రభుత్వంలో కూడా కొనసాగించాలని వైసీపీ నేతలు కుట్ర పన్నారని ఆరోపించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు నిజంగా హాని కలిగి ఉంటే అందుకు పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. రాత్రి పూట నరుకుతాం, పగటిపూట నరుకుతాం అని ప్రగల్భాలు పలికిన నాని అలా అనలేదని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సభ్యతా, సంస్కారం మరచి కూటమి నేతలను అరేయ్ ఒరేయ్ అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన గోడౌన్‌లోని రూ.2కోట్ల బియ్యాన్ని స్వాహా చేయడమే కాక విచ్చలవిడిగా భూములను కబ్జా చేసిన పేర్ని నానికి సచ్ఛీలుడైన మంత్రి కొల్లు రవీంద్రను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. దేశచరిత్రలో ఎన్నడూ లేని విధంగా జరిగిన భారీ లిక్కర్ స్కాంలో వైసీపీ నేతలంతా భాగస్వాములేనన్నారు. జనసేన పార్టీ నేతలు వరుదు రామకృష్ణ, కూనపరెడ్డి రంగయ్యనాయుడు, ఊచా వెంకయ్య పాల్గొన్నారు.



కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

రప్పా రప్పా వ్యాఖ్యలపై ఫిర్యాదు

వైసీపీ నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలి: టీడీపీ

కంచికచర్ల రూరల్ / వీరులపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఓడితే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని చెప్పిన మొండితోక అరుణ్‌కుమార్ పారిపోయి అప్పుడప్పుడు వచ్చి వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడంతో పాటు అలజడులు సృష్టించాలని చూస్తే ఊరుకునేది లేదని టీడీపీ మండలాధ్యక్షుడు కోగంటి బాబు హెచ్చరించారు. అరుణ్‌కుమార్ చేసిన రప్పా రప్పా వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఆయన నేతలతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వసూళ్ల బ్రదర్స్‌గా పేరు గాంచిన మొండితోక బ్రదర్స్ రాజకీయంగా ఎప్పుడో సమాధి అయ్యారన్నారు. వేమా వెంకట్రావ్, దాములూరి మధుసూదనరావు, ముత్తా రత్నం, గూడవల్లి గణేష్, రత్నం, బత్రై శంకర్రావు, వాసు పాల్గొన్నారు.

వీరులపాడులో..

వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ పచ్చని పల్లెల్లో చిచ్చురేపేలా చేసిన వ్యాఖ్యలను టీడీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. జుజ్జూరు పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ కంచికచర్ల ఓసీ క్లబ్‌లో అరుణ్‌కుమార్ వైసీపీ వచ్చిన 2 నెలల్లోనే టీడీపీ నేతల్ని రప్పా రప్పా ఆడిస్తామని చేసిన వ్యాఖ్యలు ఆయన అహంభావానికి నిదర్శమన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు కాండ్రగుంట శ్రీనివాస్‌కుమార్, చిదిరాల భారతరెడ్డి, కాపా రాంబాబు, యర్రగుంట కృష్ణారావు, తమ్మిశెట్టి వీరబాబు, గువ్వల సత్యనారాయణ, ఇలాసాగరపు మల్లి, కోటిరెడ్డి, శివ పాల్గొన్నారు.

ఆగని అక్రమ నిర్మాణం

● అధికారుల నోటీసులు బేఖాతరు
● దర్జాగా గోడల నిర్మాణం
● అధికారుల తీరుపై అనుమానాలు

ఇబ్రహీంపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అధికారుల నోటీసులకు బెదిరేది లేదు. ఎన్ని నోటీసులిచ్చినా నిర్మాణం ఆపేది లేదు. ఎవరొచ్చి ఆపుతారో చూస్తాం అంటూ ఆక్రమిత ఇరిగేషన్ స్థలంలో అడ్డుగోలుగా జీ ప్లస్ 1కు శ్లాబు పూర్తి చేసిన ఆక్రమణదారుడు తాజాగా గోడల నిర్మాణం చేపట్టి అందర్నీ విస్మయానికి గురి చేశాడు. కొండపల్లి మున్సిపాలిటీలో శాంతినగర్ వద్ద తారకరామా ఎత్తిపోతల పథకం కాలువకు చెందిన భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసి ఎన్టీటీపీఎస్‌లో ఉద్యోగం చేస్తున్న వ్యక్తికి పక్క సర్వే నంబరు వేసి అమ్మారు. అయితే ఆ భూమి ఇరిగేషన్‌కు చెందింది కావడంతో అటు ఇరిగేషన్ అధికారులు నిర్మాణాన్ని ఆపాలని చెప్పారు. కొండపల్లి మున్సిపల్ అధికారులు 2 సార్లు నోటీసులిచ్చారు. అయినా సదరు ఉద్యోగి నిర్మాణాన్ని ఆపడం లేదు. ఎంచక్కా గోడలు నిర్మించేస్తున్నాడు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తుండటం వెనుక ఆంతర్యం ఏమిటనేది తెలియలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇరిగేషన్ స్థలంలో జరుగుతున్న అక్రమ కట్టడాన్ని నిలిపేయాలని పలువురు కోరుతున్నారు.

ఆపమని చెప్పాం.. వినకుంటే కూల్చేస్తాం

బీ రమ్య కీర్తన, కమిషనర్, కొండపల్లి

ఆక్రమిత స్థలంలో అడ్డగోలుగా నిర్మిస్తున్న భవనాన్ని ఆపేయాలని చెప్పాం. ఒకటి రెండ్రోజుల్లో యంత్రాల సాయంతో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తాం. ఏ ఒక్క ఉద్యోగి అక్రమ భవన నిర్మాణదారుడి నుంచి ముడుపులు తీసుకోలేదు. అసత్య ప్రచారాలు చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.

కాలువ చివర భూములకూ

సాగునీరందించండి

రైతు నేతల వినతి ● పులిచింతల నుంచి ఇస్తామన్న ఇరిగేషన్ ఈఈ


ఇరిగేషన్ ఈఈ కిరణ్ బాబుకు సమస్యలను వివరిస్తున్న నేతలు

మచిలీపట్నం టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాలువ చివరి భూముల్లో సాగునీరు లేక పైరు ఎండిపోయిందని మచిలీపట్నం, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు, పెడన, పామర్రు మండలాలకు చెందిన రైతులు సోమవారం ఇరిగేషన్ ఈఈ కిరణ్‌బాబుకు తెలిపారు. కలెక్టరేట్‌లో కృష్ణాజిల్లా భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు ఆళ్ల దుర్గా మల్లేశ్వరరావు, రాష్ట్ర నేతలు మేడసాని విజయ భాస్కర్ నాయకత్వంలో వివి ధ మండలాల నేతలు సోమవారం కలిసి రైతుల సమస్యలను వివరించారు. గూడూరు, బందరు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, పామర్రు, మండలాల నేతలు మేకల శ్రీనివాసరావు, దేవనబోయిన ప్రసాద్, కా గిత భాస్కరరావు, బీ బాలరాజు, తెనాలి సుధాకరరావు, వీవీ మోహనరావు, డి. బసవపున్నయ్యతోసపాటే జిల్లా యువజన సమాఖ్య నేత కుంభం వెంకటేశ్వరరావు రైతుల సమస్యలను ఈఈకి వివరించారు. నీటి యాజమాన్య పద్ధతులు క్షేత్రస్థాయి అధికారులకు తెలియకపోవడంతో, పర్యవేక్షణాలోపం వల్ల రైతులు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతున్నారన్నారు. గుడ్లవల్లేరు ఏఈకి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. వడ్లమన్నాడు మురుగు కాలువ కింద ఉన్న సైఫన్ చెత్తాచెదారంతో పూడుకుపోవడంతో సాగునీరందడం లేదన్నారు. డ్రైన్లలో పూడికతీయలేదని, తూటుకాడ, గుర్రపుడెక్క పెరిగిపోయిందని, అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని జీకేవీ కాసులు డిమాండ్ చేశారు. ఈఈ మాట్లాడుతూ పులిచింతల నుంచి సాగునీరు తీసుకుని వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

అక్రమంగా బీపీఈడీ సర్టిఫికెట్లు

● చర్యలు తీసుకోవాలని మెగా డీఎస్సీ బీపీఈడీ అభ్యర్థుల డిమాండ్


ఆందోళన చేస్తున్న మెగా డీఎస్సీ బీపీఈడీ అభ్యర్థులు

మచిలీపట్నం టౌన్, జూలై 14 (ఆంధ్ర జ్యోతి): తాము కళాశాలల్లో రెండేళ్లపాటు బీపీఈడీ శిక్షణ పొంది మెగా డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యామని, కొందరు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, ప్రైవేట్ పాఠశాలలు, వలంటీర్లుగా పనిచేసేవారు దొంగదారుల్లో బీపీఈడీ సర్టిఫికె ట్లు తీసుకుని పరీక్షలకు హాజరయ్యారని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని బీపీఈడీ అభ్యర్థులు ఎండీ సిరాజ్, ఈ కల్యాణ్‌బాబు, టీ హరి, టీ భీమరాజు, కే రాంబా బు, ఎం బేగం, ఏ నరేంద్ర, టీ అశోక్, పీ సాయిరాం డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సోమవారం బీపీఈడీ అభ్యర్థులు మీడియాతో మాట్లాడారు. వ్యాయామ విద్యలో శిక్షణ పొందిన అభ్యర్థుల సర్టిఫికెట్లతో పా టు వారి పీఎఫ్ అకౌంట్లు, ఆధార్‌కార్డుల వివరాలను తీసుకుని విచార ణ జరిపితే అక్రమాలు బయటపడతాయన్నారు. సచివాలయాల్లో ఉద్యోగులుగా పనిచేస్తూ రెండేళ్ల బీపీఈడీ సర్టిఫికెట్ ఎలా పొందుతారన్నా రు. పోలీసు కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఉద్యోగులుగా పనిచేస్తూ కొంద రు బీపీఈడీ సర్టిఫికెట్లు సమర్పించారన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ బీపీఈడీ సర్టిఫికెట్లు పొందినవారున్నారన్నారు. రెండేళ్లపాటు కళాశాలకు వెళ్లి 75శాతం హాజరు ఉండాలని, అలాంటి అభ్యర్థులు మాత్రమే మెగా డీఎస్సీకి అర్హులన్నారు. సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులున్నారని, వారందరూ ప్రైవేట్ కళాశాలలకు హాజరుకాకుండా ప్రభుత్వానికి సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగాలు పొందుదామనుకుంటున్నారని, వీటిపై డీఈవో రామారావు విచారణ జరిపించాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాల్సిందే: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశపుహాలులో సోమవారం రాత్రి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చడంపై మండల విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు, రీసోర్స్‌పర్సన్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 141 ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతిలో ఒక్కరూ చేరకపోవడం అధికారులు, టీచర్ల వైఫల్యమేనన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలలో 60 మంది ఉండాలి, కానీ కొన్ని పాఠశాలల్లో కేవలం 30 మంది, మరికొన్నింటిలో 60 మందిలోపుగానే పిల్లలున్నారన్నారు. 1వ తరగతి నుంచి రెండో తరగతికి పిల్లలు మారుతున్నపుడు పైతరగతిలో పిల్లల సంఖ్య ఎందుకు తగ్గుతోందని ప్రశ్నించారు. ఈ కారణాలపై అధికారులు విశ్లేషణ చేయాలన్నారు. జూన్ అయిపోయినా ఈ అంశాన్ని వదిలే ప్రసక్తి లేదన్నారు. ఎంఈవోలు, పాఠశాలల హెచ్ఎంలు, విద్యాశాఖలో పనిచేసే సిబ్బంది కలిసికట్టుగా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే పనిని చేపట్టాలన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే ఖచ్చితంగా పాఠశాలలను మూసివేస్తామని కలెక్టర్ తెలిపారు. మంగళవారం ప్రత్యేకడ్రైవ్‌ను నిర్వహించి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే టీచర్లు వారు పనిచేసే పని చేసే ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలతో సమన్వయం చేసుకోవాలన్నారు. డీఈవో పీవీజే రామారావు, ఎంఈవోలు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, రీసోర్స్ పర్సన్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	99, 107, 118
చికెన్ విత్ స్కిన్	190
చికెన్ స్కిన్‌లెస్	200

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

కొండాలమ్మకు ఆషాఢ సారె

గుడ్లవల్లేరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢమాస మహోత్సవాల్లో భాగంగా సోమవారం వేమవరం కొండాలమ్మ అమ్మవారికి ఆలయ చుట్టుపక్కల ఉండే దుకాణదారులు ఆషాఢ సారెను సమర్పించారు. మేళతాళాలతో, పసుపు బిందెలలో సారెను, పట్టుచీరెను, పండ్లను మహిళలు ఊరేగింపుగా తీసుకు వచ్చారు. ఈవో కొండలరావు, శివసంతోష్ శర్మ పాల్గొన్నారు.

తోట్లవల్లూరు, : భద్రిరాజుపాలెంలో సోమవారం రాజరాజేశ్వరి అమ్మవారికి భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. ఉదయబాస్కర్ ఇంటి నుంచి మహిళలు సారె తీసుకువచ్చి సమర్పించారు.


అమ్మవారికి సారెను తీసుకొచ్చిన దుకాణాదారులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి

గుడివాడ రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు సీజనల్ వ్యాధులు రాకుండా అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మోటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీప్తి అన్నారు. సోమవారం మల్లాయిపాలెం పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో సంచార వైద్యశిబిరం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామ శివారు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లో బ్లీచింగ్ చల్లాలని, తాగి చల్లార్చిన నీటిని తాగాలని కోరారు. అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీ4 సర్వేపై అవగాహన అవసరం

గుడివాడ రూరల్ : ప్రజలకు పీ4 సర్వే గురించి వివరాలు తెలియజేయాల్సిన బాధ్యత కార్యదర్శులకు ఉందని ఎంపీడీవో విష్ణుప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు ఆయా గ్రామాల్లో ఉన్నత వర్గాలను గుర్తించిన పేద వారికి సహాయం అందించటానికి కృషి చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో బంగారు కుటుంబాలను తయారు చేయాల్సిన బాధ్యత ఆయా సచివాలయ సిబ్బంది, కార్యదర్శులపై ఉందన్నారు. డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

గుడివాడ : స్థానిక నాగవరప్పాడుకు చెందిన నందివాడ వార్త విలేకరి ముత్యాల సుధాకర్ కుమారుడు సుజిత్(10) సోమవారం ఇంట్లో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో సుజిత్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గుడివాడ : కలవపాముల- వెంట్రప్రగడ మధ్య గుడివాడ- విజయవాడ రహదారిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్య గాయాలపాలైంది. ద్విచక్రవాహనంపై వస్తున్న భార్యభర్తలను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందని స్థానికులు పేర్కొన్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

వృద్ధురాలికి చికిత్స

గుడివాడ : పామర్రురోడ్డులో కంకిపాడుకు చెందిన రేమల్లి అన్నపూర్ణమ్మను ఆమె కుటుంబసభ్యులు నడిరోడ్డుపై వదిలేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ టూటౌన్ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) సోమవారం ఆమెను అంబులెన్స్‌లో తీసుకువచ్చి స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా


పామర్రులో..

పామర్రు, జూలై14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. సోమవారం కనుమూరులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా పల్లె పండుగ కార్యక్రమం ద్వారా కనుమూరులో నూతనంగా ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.25.09లక్షలతో నిర్మితమైన ఐదు సీసీ రోడ్ల స్థానిక నేతలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలు, పట్టణాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లలో ప్రతి గ్రామంలోనూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తుందన్నారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నాయా.. లేదా..అని అడుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మిదాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ మండపాక శంకర్ బాబు, దాలిపర్తి ప్రసాద్, మంతెన రామంజనేయులు, చలమలశెట్టి శ్రీనివాసరావు, రాంబాబు పాల్గొన్నారు.

పెదపారుపూడి: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చలసాని రమేష్ చౌదరి పేర్కొన్నారు. వెంట్రప్రగడ గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు ప్రచారాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. గ్రామాల్లో స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లిన ప్రజలను ఆత్మీయంగా పలుకరిస్తూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు కూచిపూడి సుబ్బయ్య, పునుగోటి సపత్యనారాయణ, మాజీ సర్పంచ్ గొరిపర్తి రవికుమార్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలని పామర్రు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కోట వీరబాబు నాయకులు, కార్యకర్తలకు సూచించారు. చాగంటిపాడులో సోమవారం సాయంత్రం మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. పింఛన్ మూడువేల నుంచి రూ.4 వేలకు పెంచటం, ఉచితంగా గ్యాస్ బండలు ఇవ్వటం, చదువుకునే విద్యార్థులందరికి తల్లికి వందనం తదితర పథకాలను అమలుజేసిన ఘనత కూటమికే దక్కిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కళ్లం వంశీకృష్ణారెడ్డి, చాగంటి తిమ్మారెడ్డి, మట్టా అమృతబాబు ఎం చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తోట్లవల్లూరులో..


పెదపారుపూడిలో..

తోట్లవల్లూరు శివారు కలాస్‌మాలపల్లిలో సోమవారం రాత్రి రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను గురుమూర్తి ప్రజలకు వివరిస్తు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు గొరిపర్తి గోపయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి కొత్తపల్లి కిరణ్ పాల్గొన్నారు.


బహుమతులు, పుస్తకాలు పొందిన విద్యార్థులు

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

పెదపారుపూడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులలో ఆయా తరగతులలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. గ్రామానికి చెందిన అట్లూరి అచ్యుత రామారావు - సరోజిని దంపతుల జ్ఞాపకార్థం వారి మనుమరాళ్లు, ప్రవాస భారతీయులు అట్లూరి ఐశ్వర్య, అట్లూరి అనన్య తమ దాతృత్వంతో ఈ బహుమతులను సోమవారం విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు.

నందివాడ : గుడివాడ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో తమిరిశ శివారు అంబేడ్కర్ నగర్‌లో ఉన్న పాఠశాలలో రోటరీక్లబ్ కార్యదర్శి గుళ్లపల్లి కిరణ్‌బాబు సహాయ సహకారలతో సుమారు 50 మంది విద్యార్థినీ, విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వల్లూరిపల్లి ధనుంజయ తెలిపారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ముళ్లపూడి రమణమూర్తి, గ్రామస్థులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్ల నిర్వహణ లోపంపై ఫిర్యాదు

పమిడిముక్కల : విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిలో ఉయ్యూరు నుంచి పామర్రు వరకు ఫ్లైఓవర్, సమీప ప్రాంతాల్లో వెలగని వీధిలైట్లు, సర్వీసురోడ్ల నిర్వహణ అస్తవ్యస్తంపై యుఎఫ్ఆర్టీఐ కో-కన్వీనర్, సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ నేతృత్వంలో యుఎఫ్ఆర్టీఐ ప్రతినిధుల బృందం సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. యుఎఫ్ఆర్టీఐ కోస్తాజిల్లాల కన్వీనర్ బేతపూడి జోగేశ్వరరావు, జిల్లా విభాగం కన్వీనర్ బి. దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

● వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ విజయలక్ష్మి

కూచిపూడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీల కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే సంబంధిత అధికారులకు రైతులు ఫిర్యాదు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి రైతులకు సూచించారు. కూచిపూడిలో సోమవారం ఎరువులు, పురుగు మందుల దుకాణదారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా ఎరువులు అందుబాటులో ఉండే విధంగా డీలర్లు చర్యలు తీసుకోవాలన్నారు. మొవ్వ మండలంలో సాగు విస్తీర్ణం, ఏ రకమైన ఎరువులు ఎంత మేరకు అందుబాటులో ఉన్నది అన్న విషయాలపై వ్యవసాయ శాఖాధికారులను అడిగి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో మొవ్వ సబ్ డివిజన్ ఏడీఏ శ్యామల, ఏవో సురేష్ నాయక్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ విజయలక్ష్మి

స్వచ్ఛందంగా పంట కాలువ పూడికతీత పనులు

కూచిపూడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆవిరిపూడి - కోసూరు గ్రామాల మధ్య పంట కాలువ పూడుకుపోవటం వల్ల రైతులు స్వయంగా నడుం బిగించి వారే స్వచ్ఛందంగా పంట కాలువ పూకడితీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘ కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు మాట్లాడుతూ పంట కాలువ పూడుకుపోవటం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా అనేక పర్యాయాలు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పూడికతీత పనులు చేపట్టకపోవటంతో రైతులే స్వయంగా పూడికతీత చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు. ఖరీఫ్ పనులు ప్రారంభమైన నేపథ్యంలో కాలువలు పూడుకుపోయి సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి కాలువ పూడికతీత పనులు చేపట్టాల్సిందిగా నారాయణరావుతోపాటు పలువురు రైతులు చేపట్టారు.


ఆవిరిపూడిలో కాలువ పూడికతీస్తున్న సిబ్బంది

పేర్ని నానిపై కఠిన చర్యలు తీసుకోవాలి

● వీరంకి గురుమూర్తి

పామర్రు, జూలై14 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతగా ఉన్న ఏపీలో వైసీపీ అరాచకాలు సృష్టించాలనే ప్రయత్నాలు చేస్తోందని, దీనిలో భాగంగానే జిల్లాకు చెందిన మాజీ మంత్రి పేర్నినాని విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వాఖ్యలు చేస్తున్నారని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ గాడిన పడుతున్నాయన్నారు. వైసీపీ చేస్తున్న తీరుతో రాజకీయాలు రోడ్డున పడుతున్నాయని ఆరోపించారు. చీకట్లో పనిఅయిపోవాలి, నరికేస్తాం అంటే చూస్తూ ఊరుకునే ప్రభుత్వం తమది కాదని హెచ్చరించారు. జగన్ హయంలో బీసీ గౌడ కులానికి చెందిన ఓయువకుడు తన సోదరిని అల్లారి చేస్తున్నారని ప్రతిఘటించడంతో ఆయువకుడిపై పెట్రోల్ పోసి సజీవ దహనానికి పాల్పడిన సమయంలో ఇప్పుడు ప్రశ్నించే నేతలు ఆనాడు ఎమైనారని విమర్శించారు. రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తున్న వైసీపీ శ్రేణులపై పోలీసులు సీరియస్‌గా వ్యవహరించాలని గురుమూర్తి కోరారు. ఈ సమావేశంలో టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, బోడ్డపాడు సర్పంచ్ మూడేశంకర్, టీడీపీ నేతలు పరస సుబ్రమణ్యం, వీరంకి వేంకటేశ్వరరావు, వీరంకి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గురుమూర్తి

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● వల్లూరుపల్లి రామకృష్ణ

గుడ్లవల్లేరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసు కోవాలని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల సహకార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వేదికగా 14,15,16 తేదీలు మూడు రోజులపాటు బొప్పన శరత్ గోపాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, బీఫార్మసీ, హైస్కూల్ విద్యార్థులు అధ్యాపకులు, సిబ్బందికి శంకర్ నేత్రాలయా వైద్యబృందంచే నిర్వహిస్తున్న నేత్ర వైద్యపరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత శరత్‌గోపాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. విద్యార్థులు, సిబ్బందిలో దగ్గర,దూర దృష్టి లోపం, కలర్ బ్లయిండ్నెస్ తదితర పరీక్షలు యంత్రాల ద్వారా పరీక్షించారు. ఇంతటి మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న బొప్పన తారాచంద్‌ను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. అనంతరం కళాశాల యాజమాన్యాన్ని, శంకర నేత్రాలయ వైద్యసిబ్బందిని తారాచంద్ ఫౌండేషన్ తరఫున సన్మానించారు. కార్యక్రమంలో పనీర్ ఆటోవరల్డ్ డైరెక్టర్‌లు చక్రి,మేడసాని రవీంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రాకరుణకుమార్, డైరెక్టర్ డాక్టర్ పి.సిద్ధయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఆర్.సిహెచ్ శాస్త్రి, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


నేత్రవైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రహదారిపై చేరిన నీటితో తిప్పలు

గుడివాడ : స్థానిక 13వవార్డు బాపూజీనగర్‌లో డ్రెయినేజీ నీళ్ల రహదారుల పైకి చేరుతున్నాయి. పెద్దకాలువ పొంగినప్పుడు డ్రెయినేజీ నీరు రహదారిపై చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పు

పెదపారుపూడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో శిథిలావస్థలో ఉన్న భవనాలలో కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాల మార్పును గూర్చి చర్చించటానికి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులు, వారి ప్రతినిధులతో తహసీల్దార్ శ్రీను నాయక్ సమావేశం నిర్వహించారు. యలమర్రులో పోలింగ్ కేంద్రం నెంబర్లు 100, 101 నిర్వహిస్తున్న భవనం శిథిలం కావటంతో అదే గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనంలోనికి వీటిని మార్చటం గురించి వివరించారు. అలాగే సోమవరప్పాడులో గల పోలింగ్ కేంద్రం నెంబర్ 116లో నిర్వహిస్తున్న భవనం కూడా శిథిలం కావటంతో, అదే పాఠశాలలో ఉత్తరం వైపు గదిలోనికి మార్చేందుకు చర్చించారు. దీనికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు అంగీకారం తెలిపారు. వీటిని అధికారికంగా ఆయా భవనాల్లో ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ శ్రీను నాయక్ తెలిపారు.

మరమ్మతు పనులు ప్రారంభం

గుడ్లవల్లేరు :గాదేపూడిలో తాగునీటి చెరువుగట్టు మరమ్మతులు, చెరువులో జంగిల్ తొలగింపు పనులను సోమవారం ప్రారంభించారు. పనులను మండల టీడీపీ సమన్వయకర్త అడుసుమిల్లి రామ్మోహనరావు పూజలు నిర్వహించి ప్రారంభించారు. టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు రావి పార్థసారథి, నీటిసంఘం ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బారావు, మదిరి చిననాగేశ్వరరావు, భాస్కరరావు రామాంజనేయిలు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నూతన కార్యవర్గం

గుడివాడ : భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) గుడివాడ మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.జగన్, నాగేంద్రబాబులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక సుందరయ్యభవన్‌లో జరిగిన మండల మహాసభలో ఈ మేరకు నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా సాత్విక్ ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా సాయిగణేష్, జైగణేష్, గురుదేవ్‌లు ఎన్నికయ్యారు. సభ్యులుగా నవదీప్, సాద్విక్, జెస్సీఫా, రవీంద్ర, అర్జున్ తేజలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం మాట్లాడుతూ గుడివాడలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటుచేయాలన్నారు. నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సలీం, జిల్లా సహాయ కార్యదర్శి హారిక, విద్యార్థులు పాల్గొన్నారు.

లభించని బాలుడి ఆచూకీ .. ఎమ్మెల్యే పరామర్శ

తోట్లవల్లూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి) : రొయ్యూరులో అమ్మమ్మ ఇంటికి వచ్చిన నిమ్మకూరు సర్పంచ్ పడమట దుర్గా శ్రీనివాసరావు తనయుడు పడమట నిదీష్(10) మిస్సింగ్ మిస్టరీగా మారింది. శనివారం సాయంత్రం కనిపించకుండాపోయిన నిదీష్ ఆచూకీ సోమవారం రాత్రి వరకు తెలియలేదు. కరకట్ట వెంట, కంకిపాడు వైపు అన్ని గ్రామాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించినప్పటికీ నిదీష్ జాడ తెలియకపోవటంతో సోమవారం ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని పోలీసులు రంగంలోకి దించారు. సీఐ వై చిట్టిబాబు, ఎస్సై సీహెచ్ అవినాష్ ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బందిని కేఈబీ కెనాల్లో గాలింపుకి ఆదేశించారు. దీంతో రొయ్యూరు నుండి పులిగడ్డ వరకు ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు చేపట్టినా ఫలితం లేదని పోలీసులు తెలిపారు. దీంతో నిదీష్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కుమార్ రాజా

కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, రాష్ట్ర గౌడ కార్పోరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ తదితరులు సోమవారం రొయ్యూరు వచ్చి నిదీష్ తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. నిదీష్ కోసం విస్తృతంగా గాలింపు చేపట్టాలని సీఐ చిట్టిబాబుని ఎమ్మెల్యే ఆదేశించారు.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం

గుడివాడ, జూలై 14(ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఆషాఢమాసం బహుళ సంకటహర చతుర్థి పర్వదినం సందర్భంగా లక్ష్మీగణపతి హోమం పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ హోమ పూజలో 105మంది ఉభయదాతలు పాల్గొని పూజలు నిర్వహించారు. ఉభయదాతలకు దేవస్థానం తరుపున శేషవస్త్రం, జాకెట్టు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు సాయన రాజేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం

పమిడిముక్కల : లయన్స్‌క్లబ్ ఆఫ్ కపిలేశ్వరపురం 2025- 2027 కాలానికి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ అధ్యక్షుడిగా తాతినేని సాయిదత్, ఉపాధ్యక్షుడిగా మైనేని నరేంద్ర, కార్యదర్శిగా తుమ్మల వెంకటగంగాధరరావు, కోశాధికారిగా చిగురుపాటి శ్రీకృష్ణ బ్రహ్మానందరావు, కార్యవర్గ సభ్యులుగా సూర్యదేవర ప్రవీణ్‌కుమార్, చిగురుపాటి జగదీశ్, తాతినేని రమేశ్, కడియాల ప్రకాశరావు, తుమ్మల లక్ష్మీనారాయణ చేత క్లబ్ జిల్లా గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు ప్రమాణ స్వీకారం చేయించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

గుడివాడ : ట్రాఫిక్ నియమనబంధనల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్సై నాగరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ పాఠశాలలో డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ట్రాఫిక్, మత్తు పదార్థాలు, కాల్‌మనీ మొదలగు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్స్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బుడమేరు గండ్లకు మరమ్మతులు చేపట్టాలి

● వెంకట రంగారావు, పెంటయ్య


పాడైన బుడమేరు లాకులను చూపిస్తున్న పెంటయ్య

నందివాడ, జూలై 14(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వస్తుంది బుడమేరు గండ్లు పూడ్చరా అంటూ లక్ష్మీనరసింహాపురం నీటి సంఘం సభ్యుడు పెంటయ్య, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సువారి వెంకట రంగారావు, శింగవరపు బాబురావులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లక్ష్మీనరసింహాపురం లాకుల వద్ద బుడమేరుకు గండి పడి గత రెండేళ్లవుతున్నా ఇంత వరకు డ్రెయినేజీ అధికారులు పట్టించుకోవటం లేదన్నారు.గతంలో బుడమేరు వరదలకు లక్ష్మీ నరసింహాపురం పూర్తిగా మునిగిపోతుందన్నారు. బుడమేరు లాకులు సైతం గత నాలుగేళ్లుగా తలుపులు వూడిపోయి పనికి రాకుండా పోయాయి. డ్రెయినేజీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా చూద్దాం.. చేద్దాం అంటూ కాలయాపన చేయటం తప్ప పనులు మాత్రం చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు పడి బుడమేరు పొంగితేనో, లేక వరదలు వచ్చి ఊరు మునిగిపోతేనే రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారాలు చెల్లించటం తప్ప అధికారులు నిర్లక్ష్యం వల్ల గ్రామాలు వరదకు గురవుతున్నాయని వివరించారు. డ్రెయినేజీ అధికారులు చొరవ చూపి ఈ బుడమేరుకు పడిన గండి పూడ్చే విధంగా చర్యలు ఆదేవిధంగా లాకుల మరమ్మత్తులు చేయించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	99, 107, 118
చికెన్ విత్ స్కిన్	190
చికెన్ స్కిన్‌లెస్	200

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

మార్కెట్ యార్డు చైర్మన్‌గా కుంచే నాని బాధ్యతల స్వీకరణ



మచిలీపట్నం టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్‌గా కుంచే నాని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శి భాస్కరరావు రిజిష్టర్లలో కుంచే నానితో సంతకాలు చేయించారు. కొడాలి రాణి, గోపు సత్యనారాయణ, పిప్పళ్ళ కాంతారావు, కాగిత వెంకటేశ్వరరావు, కాటం మధు తదితరులు నానిని అభినందించారు.



అవనిగడ్డలో ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ న్యాయాధికారి అరుణ

మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు పరిష్కరించుకోవాలి

అవనిగడ్డ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మధ్యవర్తిత్వం ద్వారా చిన్న చిన్న కేసులను, వివాదాలను పరిష్కరిం చుకోవాలని అవనిగడ్డ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.అరుణ సూచించారు. అవనిగడ్డ కోర్టు వద్ద నుంచి మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో మధ్య వర్తిత్వం - దేశం కోసం నినాదంతో అవనిగడ్డలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేసులతో కోర్టుల చుట్టూ తిరిగే కంటే వివాదా లను మధ్యవర్తిత్వం ద్వారా, లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.స్వర్ణలత, ఏజీపీ ఈశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామ ప్రసాద్, మధ్యవర్తిత్వ కమిటీ సభ్యులు కొండ వీటి ఈశ్వరరావు, కోట వీరబాబు, అవనిగడ్డ కోర్టు పరిధిలోని న్యాయవాదులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

బదిలీల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసన ప్రదర్శన

మచిలీపట్నం టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయాల బదిలీల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ సోమవారం సచివాలయ ఉద్యోగు లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. రెండేళ్ల సర్వీసు నిండని సచివాలయ ఉద్యోగులను సైతం బదిలీ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.



పీ-4పై మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబు

పేదరికం లేని రాష్ట్రంగా మార్చేందుకు పీ-4

కోడూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభించారని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో పీ4 కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. సమాజం దిగువన ఉన్న 20 శాతం (బంగారు కుటుంబాలను) సమాజం ఎగువన ఉన్న 10 శాతం కుటుంబాలతో (మార్గదర్శి కుటుంబాలతో) ట్యాగ్ చేసి సహాయ సహకారాలు అందించేందుకు ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విరాళాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న సంపన్న వ్యక్తులను మార్గదర్శులుగా నిరుపేద లబ్ధిదారులను బంగారు కుటుంబాలుగా గుర్తిస్తామన్నారు. మాచవరం గ్రామానికి చెందిన కృష్ణబాబు, విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన అప్పికట్ల అప్పారావు సోదరులు వీరాంజనేయులు తమ గ్రామాల్లో 10 కుటుంబాలను దత్తత తీసుకోవటానికి అంగీకరించటంతో వారిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో సుధా ప్రవీణ్, ఎంఈవో రామదాసు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఇసుక ఉచితంగా తోలుకోవటానికి అనుమతులు ఇవ్వాలని వినతి

అవనిగడ్డ రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఇసుక ఉచితంగా తోలుకోవటానికి అనుమతి ఇప్పించాలని కోరుతూ డాగే రాము, అజయ్ కిషోర్ ఆధ్వర్యంలో పలువురు ట్రాక్టర్ యజమానులు ఎంపీడీవో మరియదేవికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ట్రాక్టర్లు నడుపుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం రీచ్ ద్వారా ఉచిత ఇసుక ఇవ్వటం వల్ల ట్రాక్టర్ల ద్వారా ఇసుక తోలుకుని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఉచిత ఇసుక నిలుపుదల చేయటంతో ట్రాక్టర్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇసుక తోలుకోవటానికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.



మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ సుధారాణి

మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

ఘంటసాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం వరి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయనాలు వినియోగించటం వల్ల దుష్ఫలితాలు కలుగుతాయన్నారు. ఎరువుల యాజమాన్యం, కలుపు, నీటి యాజమాన్యం, అవగాహన కల్పించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబు మాట్లాడుతూ స్థూల దేశీయ ఉత్పత్తి పెరటానికి రైతులు, శాస్త్రవేత్తలు సూచనలు పాటించాలని అన్నారు. శాస్త్రవేత్తలు వెంకటలక్ష్మీ, రేవ తి, నవీన్, ఏడీఏలు శ్యామల, జయప్రద, ఏవోలు, ఏఈవో పాల్గొన్నారు.

జలధీశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.44 లక్షలు



ఘంటసాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : బాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి దేవస్థానం హుండీల కానుకలను దేవస్థానం ఇన్స్‌పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. తొమ్మిది నెలలకు రూ.2,44,135 ఆదా యం వచ్చినట్లు ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) తెలిపారు. ఆలయ సిబ్బంది నాగరాజు, అర్చకులు పాల్గొన్నారు.



మడకలో ఎమ్మెల్యే కాగితతో కేక్ కట్ చేయిస్తున్న స్థానిక యువత



ఘంటసాలలో కరపత్రాలు అందజేస్తున్న ముప్పనేని రవి



అవనిగడ్డలో కరపత్రాలు అందజేస్తున్న యాసం చిట్టిబాబు

అర్హులకు సంక్షేమ పథకాలు చేరాలన్నదే లక్ష్యం

పెడన రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మడక గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యువకులు కృష్ణప్రసాద్‌ను గజమాలతో సత్కరించి కేక్ కట్ చేయించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శీరం ప్రసాద్, గంధం గోపాలకృష్ణ, పరసా రాంబాబు, పరసా కామేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుస్థిర పాలన

ఘంటసాల : ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సుస్థిర పాలన సాధ్యమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీకాకుళంలో సోమవారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నేతలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రవి ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగమైన ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి అమలు చేస్తుందన్నారు. టీడీపీ నేతలు పాటిబండ్ల నరేష్, కోడి శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవనిగడ్డ : టీడీపీతోనే సుపరిపాలన సాధ్యమని, కూటమి ప్రభుత్వ పాలనలో సంవత్సర కాలంగా రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిన ఘనత చంద్రబాబు నాయుడికే దక్కుతుందని మండల టీడీపీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు అన్నారు. అవనిగడ్డ ఆరో వార్డులో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఇంటింటికి తిరిగి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. చంద్ర నరసింహారావు, యలవర్తి చిన్నా, అన్నపపరెడ్డి లక్ష్మీనారాయణ, పులిగోరు రాజేంద్ర ప్రనసాద్, డేగల రామారావు, బచ్చు రఘునాథ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజలకు మంచి నేర్పండి : పేర్నికి హితవు

పెడన రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మంచి నేర్పితే, మంచి నేర్చుకుంటారు. నరికేయండి.. చికట్లో కన్ను కొట్టండి అంటే దాని అర్థం ఏమిటని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మడక గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి కాయకులు అల్లర్లు సృష్టించాలని ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేర్ని నాని నోటికి అడ్డూఅదుపూలేకుండా మాట్లాడుతున్నాడన్నారు. యువతను పక్కదారి పట్టించే ప్రసంగాలతో రాష్ట్రంలో అరాచకాలను సృష్టించాలనుకుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు.

పేర్ని నాని అవినీతి అక్రమాలు బట్టబయలు చేస్తాం : టీడీపీ నేత దిలీప్

మచిలీపట్నం టౌన్ : మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని అక్రమాలను బట్టబయలు చేస్తామని టీడీపీ నాయకులు ఐ. దిలీప్‌కుమార్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2004 ఎన్నికల ఆఫిడవిట్‌లో పేర్ని నాని ఆస్తి రూ. 25 వేల నగదు, బ్యాంకులో రూ.8500, పేర్ని జయసుధకు 240 గ్రాముల బంగారం, రూ.93 వేల పాలసీలు ఉన్నాయని పేర్కొన్నారన్నారు. పాన్‌కార్డు కూడా లేదన్నారు. అయితే 20 సంవత్సరాల్లో పేర్ని నాని వందల కోట్లు ఎలా సంపాదించారని దిలీప్ ప్రశ్నించారు. టీడీపీ నాయకుడు సయ్యద్ ఖాజా, జనసేన నాయకుడు మాదివాడ రాము మాట్లాడారు.

బంటుమిల్లి నాయకుల హెచ్చరిక

బంటుమిల్లి : వైసీపీ సైకో పరిపాలన సాగిస్తే టీడీపీ సుపరిపాలన అందిస్తోందని మండల టీడీపీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు అన్నారు. పెడనలో వైసీపీ సమావేశంలో ఆ పార్టీ నేతలు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బంటుమిల్లిలో పాత్రికేయుల సమావేశంలో సోమవారం టీడీపీ నాయకులు మాట్లాడుతూ, సమాజంలో కుల, మత, ప్రాంతీయ ద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరుమార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాలని హెచ్చరించారు. డీసీ చైర్మన్ బొర్రా కాశీ, జొన్నలగడ్డ కొండ, నూర్, నజీర్, ఆకునూరి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేన్సర్ బాధితుడికి ఐవీఎం సురేష్ రూ.50 వేల సహాయం

చల్లపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్‌తో బాధపడుతున్న యువకునికి ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్-రోజా దంపతులు రూ.50 వేల ఆర్థిక సాయమందించారు. మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామానికి చెందిన యువకుడు కొక్కిలిగడ్డ శశాంక్‌బాబు బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. గత ఏడాది తండ్రి మరణించటంతో తల్లితో పాగోలులో అమ్మమ్మ ఇంటివద్ద నివసిస్తున్నాడు. యువకుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఐవీఎం సురేష్ సాయం అందజేశారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బంటుమిల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీషు, మ్యాథ్స్, హిస్టరీ, సివిక్స్, కామర్స్ ఒకేషనల్, షార్ట్ హ్యాండ్, టైపు రైటింగ్ పో స్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సంబంధిత సబ్జెక్టులలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 15, 16 తేదీలలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 17వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూ, డెమోకు సర్టిఫికెట్‌లతో హాజరుకావాల్సిందిగా కోరారు.

తులసీరత్నం సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

చల్లపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 80 సెంట్ల స్థలాన్ని ఉచితంగా అందించి, భవన నిర్మాణం పూర్తయ్యేవరకు సొంత ఇంటిని పీహెచ్‌సి నిర్వహణకు అందించిన సేవామూర్తి నాదెళ్ల తులసీరత్నం సేవానిరతి చిరస్మరణీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. వితరణశీలి, ఆధ్యాత్మికవేత్త తులసీరత్నం ఇటీవల పురిటిగడ్డలో కన్నుమూయగా వారి కుమారుడు, విశ్రాంత ఆర్డీవో శివరామకృష్ణను ఎమ్మెల్యే పరామర్శించారు. తులసీరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీటీసీ సభ్యురాలు రాజులపాటి అంకమ్మ ఏఎంసీ డైరెక్టర్ నాదెళ్ల వెంకట నరసయ్య, టీడీపీ నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, పరుచూరి సురేష్, కైతేపల్లి శ్రీనివాసరావు, దేవభక్తుని గోపాలకృష్ణ, నాదెళ్ల పిచ్చియ్య తదితరులున్నారు.



విశ్రాంత ఆర్డీవో శివరామకృష్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మండలి

టీడీపీ నేతకు పరామర్శ : వక్కలగడ్డలో టీడీపీ నేత తాతినేని సాయిని ఎమ్మెల్యే మం డలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. అనారోగ్యంతో ఇటీవల విజయవాడ ఆసుపత్రిలో చికిత్సపొందటంతో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

పోటుమీద మాజీ సర్పంచ్ భౌతికకాయానికి ఘన నివాళి

కోడూరు : పోటుమీద గ్రామంలో మాజీ సర్పంచ్, మా జీ పీఏసీఎస్ అధ్యక్షులు కడవకొల్లు నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సోమవారం ఉదయం ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. నాగేశ్వరరావు మృతి పట్ల తన ప్రగాఢ సంతాపం, కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మచిలీపట్నం ఎరువుల షాపుల్లో తనిఖీలు



మచిలీపట్నం టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలోని ఎరువుల షాపులపై ఏడీఏ పి. చంద్రశేఖర్, వ్యవసాయ శాఖాధికారులు బంగార్రాజు, శ్రీనివాసరావు, ఎం.రామ్‌కుమార్ తదితరులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ డీఎస్పీ బంగార్రాజు మాట్లాడుతూ, పురుగు మందులు, ఎరువులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. డీలర్ల వద్ద రైతులు రశీదులు అడిగి తీసుకోవాలన్నారు. ఎమ్మార్పీకే ఎరువులు, పురుగుమందులు అమ్మాలని సూచించారు.

ప్రజాసమస్యలు పట్టని కూటమి, వైసీపీ : సీపీఎం

మచిలీపట్నం టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ నాయకులు ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ఒకరిపై ఒకరు రెచ్చగొట్టే విధంగా విమర్శలు చేసుకుంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, యూరియా అందుబాటులో లేదన్నారు. విద్యుత్ చార్జీలు పెరిగాయని, స్మార్ట్ మీటర్లు ప్రజలకు భారమవుతున్నాయన్నారు. ప్రజలకు ఇళ్లస్థలాలు, ఇళ్లు ఇస్తామని చెప్పారని, ఏడాది పూర్తయినా ఇంకా ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని నరసింహారావు విమర్శించారు. సీపీఎం నాయకులు బి. సుబ్రహ్మణ్యం, కొడాలి శర్మ, ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

మచిలీపట్నం టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజాతీయ కళాశాలలో ఈనెల 16న జరగనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ కోరారు. బందరు మండలంలోని పలు సచివాలయాల్లో గోపు సత్యనారాయణ పర్యటించి జాబ్‌మేళా కరపత్రాలను అందజేశారు. మచిలీపట్నంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహాలక్ష్మి అమ్మవారికి సారె సమర్పణ



కోడూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కోడూరు భద్రావతి సమేత భావనా రుషి స్వామి దేవాలయంలోని మహాలక్ష్మి అమ్మవారికి భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. డప్పు వాయిద్యాల నడుమ పసుపు, కుంకుమ, చీర, రవిక, పళ్లు, పూలు తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను దేవస్థానం కమిటీ సభ్యులు పర్యవేక్షించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీలు 19న

అవనిగడ్డ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అనుబంధ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అవనిగడ్డ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన గండిగుంటలోని దత్త కల్యాణ మం డపంలో యోగా పోటీలు నిర్వహించను న్నట్లు సంస్థ అధ్యక్షుడు దుట్టా ఉమామహేశ్వరరావు తెలిపారు. 10 నుంచి 55 ఏళ్ల వరకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9502886748 నెంబర్‌కు ఫోన్ చేసి గూగుల్‌లో అప్లికేషన్ పొందవచ్చునని దుట్టా ఉమామహేశ్వరరావు తెలిపారు.

ఆషాఢ కృత్తి మహోత్సవాలు 17 నుంచి

మోపిదేవి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 17వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో పవిత్రోత్సవ సహి ఆషాఢ కృత్తిక (ఆడి కృత్తిక) మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. మూడు రోజులపాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించనన్నట్లు తెలిపారు. 20వ తేదీ ఆదివారం స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా ఆషాఢకృత్తిక మహోత్సవం జరుగుతుందని తెలిపారు. అదే రోజు ఉదయం 9 గంటలకు శ్రీవల్లీ దేవసేనా అమ్మవార్లకు శాకంబరి అలంకరణ నిర్వహించనన్నట్లు ఆయన తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులకు జీతాలివ్వండి సారూ..

మచిలీపట్నం టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 15వ తేదీ వచ్చినా ఇంకా జీతాలు అందలేదని ఏఐటీయూసీ నాయకులు మోదుమూడి రామారావు సోమవారం మునిసిపల్ కమిషనర్ బాపిరాజు దృష్టికి తీసుకెళ్లారు. చైతన్య, యర్రంశెట్టి ఈశ్వరరావు, రామకృష్ణ, శ్రీమన్నారాయణ, రత్నబాబు, ఎం.ప్రసాద్ కలిసి కార్మికులకు జీతాల చెల్లింపు విషయమై చర్చించారు. రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే మండలికి ఏఎంసీ డైరెక్టర్ సన్మానం

అవనిగడ్డ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు జరుగు ఆదినారాయణ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనను ఏఎంసీ డైరెక్టర్ పదవికి సిఫార్సు చేసిన సందర్భంగాఎమ్మెల్యే మండలిని ఘనంగా సత్కరించారు. మండలి వెంకట్రామ్, యర్రంశెట్టి దామోదర్, కోట రాంబాబు, రేపల్లె రవీంద్ర, బషీర్ మొహిద్దీన్, దాసరి వెంకట కృష్ణారావు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కాగిత రామారావు, పూతబోయిన కరుణాకర్, సిద్ధినేని అశోక్ నాయుడు, అప్పికట్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ ఎన్నిక రేపు

నాగాయలంక, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : భావదేవరపల్లి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పరిశె అమ్మన్న చనిపోయిన నేపథ్యంలో నూతన ఉపాధ్యక్షుడి ఎన్నిక ఈనెల 16 వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.సుధాప్రవీణ్ తెలిపారు.

ఘటం బిందెలు, చీరల బహిరంగ వేలం 17న

అవనిగడ్డ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : లంకమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన ఘటం బిందెలు, చీరల బహిరంగ వేలంపాట ఈనెల 17న 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) ఒక ప్రకటనలో తెలిపారు. 11 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహించటం జరుగుతుందని, ఆసక్తి గల భక్తులు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.